



కేటుగాళ్లు!

మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలో వసూళ్ల పర్వం!

కూటమి, వైసీపీ నాయకులు కుమ్మక్కై బరితెగింపు

కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే మచిలీపట్నంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు సిండికేట్ అయ్యారు. అందరితో కలుపుగోలుతనంగా ఉంటున్నట్లుగా చూపేందుకు ఓ పట్టణస్థాయి నాయకుడు ఈ సిండికేట్‌ను ఏర్పాటు చేశాడు. మీ డివిజన్‌లో ఏమైనా పనులు కాకుంటే నేను చేయిస్తానంటూ హడావుడి చేసి అధికారులపై ఒత్తిడి తెస్తున్నాడు. క్లస్టర్ ఇన్‌చార్జిలకు ఆదాయ మార్గాలను చూపిస్తానంటూ ఆశలు రేపుతున్నాడు. వివిధ పనులకు సంబంధించి అరకొరగా వారి చేతుల్లో పెట్టి, పెద్ద మొత్తంలో నగదు వెనకేసుకుంటున్నాడు. ఇదే తరహాలో సిండికేట్‌లోని వారంతా మంత్రి మా వెంటే ఉన్నాడని పైకి చెబుతూ, ఆయనకు తెలియకుండానే తెరవెనుక అక్రమాలకు తెర తీస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

- భవన నిర్మాణదారుల నుంచి భారీగా వసూలు
- దరఖాస్తుల సమాచారం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు
- విస్తీర్ణం బట్టి రూ.50 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు డిమాండ్
- పరాసుపేటలో గతంలో శ్లాబు పగలకొట్టిన భవన సముదాయానికి మళ్లీ శ్లాబు!
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నగర వాసులు


మచిలీపట్నం మునిసిపల్ కార్యాలయం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో 50 డివిజన్‌లు ఉన్నాయి. ఈ డివిజన్‌లలోని సచివాలయాల్లో ఎవరైనా ఇంటి నిర్మాణం, భవన సముదాయాల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకుంటే వెంటనే సచివాలయ సిబ్బంది డివిజన్ ఇన్‌చార్జిలకు సమాచారం ఇచ్చేలా వ్యూహం అమలు చేస్తున్నారు. మునిసిపల్ కార్యాలయానికి వెళితే ఒకసారి మీ డివిజన్ ఇన్‌చార్జితో మాట్లాడాలని కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది చెబుతున్నారు. దీంతో దరఖాస్తుదారులు డివిజన్ ఇన్‌చార్జి వద్దకు వెళితే ఎంత విస్తీర్ణంలో ఇల్లు, గృహ సముదాయాన్ని కడుతున్నారు అనే అంశంపై ఆరా తీస్తున్నారు. తమ అనునయులతో లేదా నేరుగా ఇంత మొత్తం తమకు నగదు ఇవ్వాల్సి ఉంటుందని చెబుతున్నారు. కనీసంగా రూ.50 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు దరఖాస్తు దారుల నుంచి నగదు వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు వినపడుతున్నాయి.

- పరాసుపేటలోని ఒక పాఠశాల ఎదురుగా నిబంధనలకు విరుద్ధంగా గతంలో భవన సముదాయాన్ని నిర్మించారు. అధికారులు ఈ భవనం శ్లాబును కొంత మేర పడగొట్టారు. ఇటీవల కాలంలో ఓ పట్టణ స్థాయి నాయకుడు ఈ గృహ సముదాయం నిర్మాణం చేసిన వ్యక్తితో మిలాఖత్ అయ్యి దగ్గరుండి మరీ శ్లాబు వేయించాడు. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారిందని విమర్శలు ఉన్నాయి.
- చిలకలపూడి ప్రాంతంలో ఖాళీగా ఉన్న స్థలాలు, వివాదంలో ఉన్న స్థలాలపై ఓ మాజీ కౌన్సిలర్

మిగతా 6లో..

షేర్ల కొనుగోలు పేరుతో మహిళకు రూ.39 లక్షల టోకరా

పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు

పెనమలూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో మహిళకు సైబర్ నేరగాళ్లు రూ.39 లక్షలకు పైగా టోకరా వేసిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పోరంకి గ్రామానికి చెందిన కోట శశికళ జూన్ 17న నివేష్ స్ట్రాటజీ అనే వాట్సాప్ గ్రూప్‌లో చేరారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో ఆమె క్రమం తప్పకుండా డీమ్యాట్ ఖాతాను తెరిచి ఎక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టారు. జూలై 22 నుంచి ఆగస్టు 19 మధ్య వివిధ లావాదేవీల ద్వారా రూ.39.15 లక్షలను దుండగులు చూపించిన వివిధ ఖాతాలకు పంపించి షేర్లను కొనుగోలు చేశారు. సదరు షేర్లపై కొంత సమయం తర్వాత రూ.14 లక్షలు లోన్ ఉందని దుండగులు చెప్పగా తాను మోసపోయినట్లు గ్రహించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి నుంచి భారీ వర్షాలు

వాతావరణ శాఖ హెచ్చరిక

విజయవాడ, సెప్టెంబర్ 01 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య బంగాళాఖాతంలో సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల

మిగతా 6లో..


నాగాయలంక శ్రీరామపాదక్షేత్రంలో గణేశ్ విగ్రహం నిమజ్జనం చేస్తున్న భక్తులు

లడ్డూ @ రూ.1,96,003



గుడివాడ పట్టణం బైపాస్ రోడ్డులోని గణేష్ రాయల్ క్రూయిస్ అపార్టుమెంట్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద సోమవారం నిర్వహించిన వేలంలో లడ్డూ అధిక ధర పలికింది. చెరియన్ మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాల వైద్యులు దుర్గాప్రసాద్ రూ.1,96,003లకు స్వామివారి లడ్డూను దక్కించుకున్నారు. -ఆంధ్రజ్యోతి-గుడివాడ

దసరా స్పెషల్ @ 500



ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ ప్రణాళిక

స్పెషల్ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణం

- పీఎన్‌బీఎస్‌కు వచ్చే డిమాండ్‌కు అనుగుణంగా ఆపరేషన్స్
- అమలాపురం, కాకినాడ, రాజమండ్రి, రాయలసీమకు సర్వీసులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) రికార్డు స్థాయిలో 500 స్పెషల్ బస్సులు నడపాలని భావిస్తోంది. త్వరలో దీనికి సంబంధించి అధికారికంగా షెడ్యూల్ ప్రకటించనుంది. దసరా స్పెషల్ బస్సుల్లో కూడా మహిళలకు ఉచిత రాయితీ యథాతథంగా అమలు చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. విజయవాడ రీజియన్ పరిధిలో మొత్తం 672 బస్ సర్వీసులు ఉన్నాయి. వీటిలో దూర ప్రాంత సర్వీసులను మినహాయిస్తే 500 బస్సులు ఉంటాయి. వీటన్నింటినీ కూడా దసరా ఉత్సవాలకు నగరానికి వచ్చే వారి రాకపోకల కోసం ఉపయోగించాలని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. విజయవాడ సబర్బన్ పరిధిలో మొత్తం 279 సిటీ ఆర్డినరీ బస్సులు, 100 మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు తిరుగుతున్నాయి. ఇవి కాకుండా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ తదితర బస్సులను కూడా డిమాండ్‌ను బట్టి స్పెషల్ సర్వీసులుగా నడపాలని భావిస్తున్నారు. దసరా సీజన్‌లో ప్రధానంగా అమలాపురం, కాకినాడ, రాజమండ్రి, రాయలసీమ ప్రాంతాలకు రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. సిటీ బస్ టెర్మినల్‌కు వచ్చే ప్రయాణికులను వారివారి గమ్యస్థానాలకు చేర్చటానికి వీలుగా స్పెషల్ ఆపరేషన్ చేపట్టనున్నారు. పండుగకు వచ్చే వారి కోసం హైదరాబాద్, విశాఖపట్నం, చెన్నై, బెంగళూరులకు కూడా స్పెషల్ సర్వీసులు నడపనున్నారు.

బాబు.. బంగారం

- సీఎంగా చంద్రబాబు 30 ఏళ్ల ప్రస్థానంపై నాయకుల మనోగతం.. 6

మత్తు స్వరూపం!

డ్రాపింగ్ పాయింట్ లొకేషన్ పంపిన స్వరూపరాజు

- ఎండీఎంఏ కేసులో కొత్త పేరు
- బయటకు వస్తున్న మత్తు లింకులు
- పోలీసులను తప్పుదోవ పట్టించిన శ్రీవాత్సవ్
- స్వరూపరాజు పేరును గోప్యంగా ఉంచిన ప్రధాన నిందితుడు
- లోహిత్‌ను కోర్టులో హాజరుపరిచిన పోలీసులు
- 12 వరకు రిమాండ్



(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : వైజాగ్ ప్రేమికుల డ్రగ్ కేసులో ప్రధాన నిందితుడు పోలీసులను తప్పుదారి పట్టించాడా? వాంగ్మూలంలో వాస్తవాలు చెప్పకుండా గోప్యంగా ఉంచాడా? అంటే అవుననే అంటున్నాయి విశ్వసనీయవర్గాలు. కొద్దిరోజులు క్రితం వైజాగ్‌కు చెందిన అర్జా శ్రీవాత్సవ్, బొడ్డేపల్లి హవీల డిలైట్ ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్స్‌తో ఈగల్ బృందానికి చిక్కిన విషయం తెలిసిందే. ఈ కేసును తవ్వే కొద్దీ కొత్త కోణాలు, లింక్‌లు బయటకు వస్తున్నాయి. వైజాగ్‌కు చెందిన లోహిత్ యాదవ్ డ్రాపింగ్ పాయింట్ లొకేషన్‌ను వాట్సాప్‌లో పంపాడని, అక్కడి నుంచి తాను డ్రగ్‌ను తీసుకున్నానని పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. లోహిత్‌ను అదుపులోకి తీసుకున్న తర్వాత శ్రీవాత్సవ్ వాస్తవం చెప్పలేదని తేలింది. లోహిత్‌ను పోలీసులు విచారించగా అసలు విషయంతో పాటు కొత్తపేరు వెలుగులోకి వచ్చింది. శ్రీవాత్సవ్, హవీల నుంచి ఎల్ఎస్‌డీ డ్రగ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీన్ని తానే తెప్పించుకున్నట్టు లోహిత్ యాదవ్ వెల్లడించాడు. దీనికి సంబంధించి రూ.13వేలను పేమెంట్ యాప్ ద్వారా పంపించాడు. దీంతో శ్రీవాత్సవ్,

మిగతా 6లో..


ఎవరీ స్వరూపరాజు

లోహిత్ యాదవ్‌ను విచారించగా వైజాగ్‌కు చెందిన స్వరూపరాజు పేరు వెలుగులోకి వచ్చింది. అతడిని పోలీసులు ఏ6 నిందితుడిగా ఎఫ్ఆర్‌లో చేర్చబోతున్నారు. బెంగళూరులోని సింగసంద్ర మెట్రో రైల్వేస్టేషన్ వద్ద ఉన్న డ్రాపింగ్ పాయింట్‌ను శ్రీవాత్సవ్‌కు స్వరూపరాజు వాట్సాప్ ద్వారా పంపాడు. ఇప్పుడు ఈ స్వరూపరాజు ఎవరన్న దానిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. లోహిత్ యాదవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్న విషయం తెలియడంతో స్వరూపరాజు సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఐదుగురు నిందితులు ఉన్నారు. నిందితులు ఒక్కొక్కరు దొరికే కొద్దీ ఈ లింక్‌ల సంఖ్య మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని పోలీసులు భావిస్తున్నారు. ఈ కేసులో స్వరూపరాజును ఆరో నిందితుడిగా చేర్చాలని కోరుతూ పోలీసులు కోర్టులో మోమో దాఖలు చేశారు.



● మళ్లీ పెరిగిన వరద

ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు వరద వస్తుండటంతో పులిగడ్డ అక్విడెక్ట్ వద్ద ప్రవాహం మళ్లీ పెరిగింది. ప్రస్తుతం 3.28 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. -ఆంధ్రజ్యోతి- అవనిగడ్డ రూరల్



జలపాతాల కనువిందు

భారీ వర్షాలకు కొండపల్లి రిజర్వు ఫారెస్టులో జలపాతాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. కొండపల్లి ఖిల్లాకు వెళ్లే ఘాట్‌రోడ్డు మార్గంలో ఈ వాటర్ ఫాల్స్ కనిపిస్తున్నాయి. ఇక్కడకు వెళ్లేందుకు మార్గం లేకపోయినా కొందరు యువకులు మాత్రం సాహసం చేసి వెళ్తున్నారు. 8

సమస్యలు పరిష్కరించాకే ఆ సమాచారం ఆన్‌లైన్ చేయాలి 8

● కలెక్టర్ బాలాజీ

పెరిగిన స్త్రీ శక్తి!

ఉచిత ప్రయాణంపై మహిళల మొగ్గు

విజయవాడ సిటీలోకి వచ్చే ఆర్టీసీ బస్సులన్నీ కిటకిట

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్త్రీ శక్తి పథకం నూరుశాతం సార్థకతను సాధించింది. ఉచిత ప్రయాణంపై మహిళలు అధిక శాతం మొగ్గుచూపుతున్నారు. ఉద్యోగాలు, ఉపాధి, షాపింగ్, ఆస్పత్రులు ఇలా తమ వ్యక్తిగత పనుల నిమిత్తం ఆర్టీసీ విజయవాడ రీజియన్ పరిధిలో సగటున రోజుకు లక్షన్నర మంది ప్రయాణిస్తున్నారు. ఏ బస్సు చూసినా 95 శాతం మహిళలే కనిపిస్తున్నారు. జీరోఫేర్ టికెట్‌తో వీరికి కోట్ల రూపాయల సబ్సిడీ లబ్ధిగా చేకూరింది.

- 95 శాతంపైగా మహిళా ప్రయాణికులే..
- ఉద్యోగాలు, ఉపాధి, షాపింగ్, ఆస్పత్రులకు రాక
- సగటున రోజుకు లక్షన్నర మంది ప్రయాణాలు
- జీరోఫేర్ టికెట్‌తో మహిళలకు కోట్ల రూపాయల సబ్సిడీ లబ్ధి
- బస్‌పాస్‌ల రెన్యువల్ తగ్గించేసిన పురుషులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గ్రామీణ ప్రాంతాల నుంచి విజయవాడ సిటీలోకి వచ్చే బస్సులన్నీటిలో నూటికి 98 శాతం మహిళలే ప్రయాణిస్తున్నారు. మహిళల తాకిడి తట్టుకోలేక సబర్బన్ పరిధిలోని పురుషులు బస్‌పాస్‌లను తీసుకోవటం మానేశారు. దీంతో విజయవాడ రీజియన్ పరిధిలోని రూరల్ ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు పూర్తిగా మహిళలతో నిండిపోతున్నాయి. విజయవాడ గ్రేటర్ విలీన ప్రతిపాదిత గ్రామాల నుంచి విజయవాడ నగరానికి వచ్చే బస్సుల్లో ఈ పరిస్థితి ఉంది. ఇబ్రహీంపట్నం - విజయవాడ, హనుమాన్ జంక్షన్ - విజయవాడ, నున్న - విజయవాడ, గన్నవరం - విజయవాడ, కంకిపాడు - విజయవాడ, ఉయ్యూరు- విజయవాడ బస్సులలో ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ కనిపిస్తోంది. విజయవాడ సిటీ ఇంకా గ్రేటర్ కానప్పటికీ.. ఆర్టీసీ సబర్బన్ పరిధి మాత్రం గ్రేటర్

మిగతా 6లో..


రూరల్ ప్రాంతాల నుంచి విజయవాడకు బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలు

తగ్గిన బస్‌పాస్‌ల రెన్యువల్

విజయవాడ సిటీలో ఉద్యోగాలు, పనుల కోసం వచ్చే పురుషులు ఎక్కువగా బస్‌పాస్‌లను తీసుకునేవారు. నెలాఖరులో రెన్యువల్ చేసుకుంటారు. ఈ సెప్టెంబరు నెలకు బస్‌పాస్‌లు తీసుకునే వారి సంఖ్య గణనీయంగా తగ్గిందని ఆర్టీసీ అధికారులు గుర్తించారు. మహిళా ప్రయాణికుల తాకిడి వల్లే వీరు పాస్‌లు రద్దు చేసుకుని ద్విచక్రవాహనాలు, ఆటోల మీద ప్రయాణిస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో ఆయా ప్రాంతాల నుంచి వచ్చే బస్సులలో నలుగురైదుగురు పురుషులు తప్పితే అంతా మహిళలే ఉంటున్నారు.

పక్షం రోజుల్లో స్త్రీశక్తి పథకం అమలు ఇలా..



ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నిమిత్తం స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించి పక్షం రోజులు పూర్తయింది. ఈ సందర్భంగా విజయవాడ రీజియన్ పరిధిలో ప్రయాణించిన మహిళలు, వారికి జీరో ఫేర్ టికెట్ ప్రాతిపదికన చేకూరిన లబ్ధి వివరాలు ఇలా..

తేదీ	ప్రయాణికులు	లబ్ధి రూ.
15.8.2025	5,11	రూ.1,50,190
16.8.2025	75,557	రూ.23,16,510
17.8.2025	1,00,456	రూ.32,58,235
18.8.2025	1,32,115	రూ.40,40,740
19.8.2025	1,33,394	రూ.37,50,735
20.8.2025	1,46,060	రూ.40,48,735
21.8.2025	1,54,611	రూ.42,26,955
22.8.2025	1,58,884	రూ.43,05,690
23.8.2025	1,51,614	రూ.42,59,875
24.8.2025	1,40,192	రూ.41,49,490,
25.8.2025	1,74,134	రూ.49,12,870
26.8.2025	1,59,417	రూ.43,32,240
27.8.2025	87,617	రూ.22,36,340
28.8.2025	1,48,035	రూ.39,55,575
29.8.2025	1,68,859	రూ.44,85,670
30.8.2025	1,81,010	రూ.51,83,770
31.8.2025	1,54,124	రూ.44,98,385



ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ భాస్కర్‌రావుకు వినతి పత్రం ఇస్తున్న కౌలురైతు సంఘం నేతలు

పంట రుణాలు మంజూరు చేయండి

» కౌలు రైతు సంఘం నేతల వినతి

వన్‌టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పంటలు పండించే కౌలు రైతులకు బ్యాంకుల నుంచి వడ్డీ రాయితీతో కూడిన రుణ సౌకర్యం లేక అప్పులపాలై ఆత్మహత్య చేసుకుంటున్నారని.. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, బ్యాంకర్లపై ఉందని ఏపీ కౌలు రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు. పంట రుణాలు మంజూరు చేయాలని కోరుతూ.. విజయవాడ వన్‌టౌన్ ఆర్ఆర్ అప్పారావు వీధిలో ఉన్న స్టేట్‌లెవల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్‌బీసీ) కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 70 శాతం భూమిని కౌలు రైతులు సాగుచేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంట రుణాలకు వడ్డీ రాయితీలు, భూ యజమానులకు బ్యాంకులు పంట రుణాలు మంజూరు చేస్తున్నాయన్నారు. కౌలు రైతులకు బ్యాంకుల నుంచి వడ్డీ రాయితీతో రుణ సౌకర్యం లేకపోవటం వలన అధిక వడ్డీలకు అప్పులు చేసి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. అనంతరం నాయకులు ఎస్ఎల్‌బిసి కన్వీనర్ సి.వి.ఎన్.భాస్కరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు మంజూరు చేస్తామని సీసీఆర్‌సీ లేనివారికి ఈ-క్రాఫ్ నమోదైన ప్రతి కౌలు రైతులను జల్ జీవన్ మిషన్ ద్వారా పంట రుణాలు రూ.2లక్షలకు తక్కువ లేకుండా మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, రాష్ట్ర నాయకులు కె.ప్రభాకర్ రెడ్డి, కె.వి.పి.ఎస్. రాష్ట్ర కార్యదర్శి ఎ.మల్యాద్రి, సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హిందూత్వంపై విశ్వసనీయతను పెంచాలి

» వీహెచ్‌పీ జాతీయ ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే



హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హిందూ మతంపై ప్రజల్లో విశ్వసనీయతను మరింత పెంచడానికి విశ్వ హిందు పరిషత్ నిరంతరం కృషి చేస్తోందని సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే అన్నారు. సోమవారం స్థానిక వీహెచ్‌పీ ట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్ ఫామ్‌హౌస్‌ను సందర్శించారు. ముందుగా శ్రీకృష్ణ మందిరంలో పరాండే పూజలు నిర్వహించారు. అనంతరం గోశాలను సందర్శించి కపిల గోవులకు పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందూ మతాన్ని మరింత అభివృద్ధి చేయడానికి అనేక ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. హిందు దేవాలయాల నుంచి రూ.వేలకోట్లు ఆదాయం పొందుతున్న ప్రభుత్వం వాటి నిర్వహణపై ఆంక్షలు విధించడం శోచనీయమన్నారు. పరాండేను పుట్టగుంట సతీష్‌కుమార్ శాలువతో సత్కరించారు. ఆయన వెంట మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు ఉన్నారు.

సూపర్‌వైజర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వయోజన విద్య శాఖలో ఖాళీగా ఉన్న ఐదు సూపర్‌వైజర్ పోస్టులను డిప్యుటేషన్ పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈవో పీవీజే రామారావు తెలిపారు. ఆసక్తి గల ఎస్జీటీ, పీఈటీ, గ్రేడ్-2 భాషా పండితులు ఈనెల 5లోగా వయోజన విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలో పదేళ్ల సర్వీసుగల ఎస్జీటీలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 45 సంవత్సరాలు మించకూడదని, నెలలో 20 రోజులు మూడు, నాలుగు మండలాల్లో పగలు, రాత్రి పర్యటించాలని తెలిపారు. మాస్ కమ్యూనికేషన్, సాంస్కృతిక కార్యక్రమాల్లో నైపుణ్యం గల ఎస్జీలకు ప్రాధాన్యత ఇస్తారన్నారు. దరఖాస్తుదారుల ప్రతిభను బట్టి మార్కులు ఇస్తారన్నారు. అభ్యర్థుల అర్హతలకు వందమార్కులు కేటాయించామన్నారు. ఎస్ఎస్‌సికి ఐదు మార్కులు, ఇంటర్‌కు ఐదు మార్కులు, డిగ్రీకి పది మార్కులు, పోస్టు గ్రాడ్యుయేషన్‌కు పది మార్కులు, బీఈడీ లేక డీఈడీకి పది మార్కులు, ఎంఈడికి పది మార్కులు, డిగ్రీలో అడల్ట్ ఎడ్యుకేషన్ ఉంటే పది మార్కులు, ఎంఎల్‌వో, ఎంఆర్‌పి, ఎస్ఆర్‌జి, డిఆర్‌జిగా పనిచేస్తే ఐదు మార్కులు, కళాజాత అనుభవం ఉంటే ఐదు మార్కులు, సర్వీసు ఒక్కోఏడాదికి ఒక్కో మార్కు చొప్పున పది మార్కులు, ఇలా మొత్తం మెరిట్ అభ్యర్థులకు 80 మార్కులు, మౌఖిక ఇంటర్వ్యూకి 20 మార్కులు ఉంటాయన్నారు.



జెండా ఆవిష్కరణలో నినాదాలు చేస్తున్న నేతలు

పత్తి దిగుమతులపై సుంకాలు పునరుద్ధరించాలి

» కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య

గొల్లపూడి : భారత ప్రభుత్వం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పత్తిపై ఉన్న 11 శాతం దిగుమతి సుంకాన్ని ఎత్తివేయడం దుర్మార్గమని, వెంటనే దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించాలని కౌలు రైతు సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి పి.జమలయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం అఖిల భారత కిసాన్ సభ కౌర్కెల దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం, రాయనపాడు గ్రామంలో రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పత్తి పై దిగుమతి సుంకాలు తగ్గింపు వలన దేశీయంగా పత్తి పండించే రైతులకు తీవ్ర నష్టమన్నారు. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై 50 శాతం సుంకాలను విధించడం వలన దేశంలోనే రొయ్యల ఎగుమతులు ఆగిపోవడంతో రైతులు వీధిన పడ్డారన్నారు. దిగుమతి సుంకం తగ్గించడం వలన ఆయిల్‌పామ్ రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఇప్పటికైనా కేంద్రం పత్తిపై దిగుమతి సుంకాన్ని తిరిగి పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు పెయ్యల వెంకటేశ్వరరావు, సంఘం నాయకులు బత్తుల సత్యనారాయణ, జి.దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి భారీ వర్షాలు

(5వ పేజీ తరువాయి)

ఆవర్తనం విస్తరించి ఉన్న నేపథ్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మంగళవారం నుంచి మోస్తారు నుంచి భారీ వర్షాలు పడనున్నట్టు తెలిపింది. తీరం వెంబడి 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదముందని స్పష్టం చేసింది. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు. సోమవారం సాయంత్రానికి ప్రకాశం బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో 3.42 లక్షల క్యూసెక్కులు ఉందని జిల్లా అధికారులు తెలిపారు. దాదాపు మొదటి ప్రమాద హెచ్చరిక వరకు వరద ప్రవాహం చేరే అవకాశం ఉందన్నారు. వరదలు పూర్తిగా తగ్గే వరకు ప్రమాదకరమైన వాగులు, కాల్వలు దాటే ప్రయత్నం చేయొద్దని ప్రజలకు సూచించారు.

వీడని వరద..!

» పొంగుతున్న వాగులు.. వంకలు!
» కట్టలు తెగుతున్న చెరువులు
» పలుచోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం
» గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు



లింగాల కాజ్‌వేను ఆనుకుని ప్రమాదకరంగా ప్రవహిస్తున్న మునేరు

ఎగువన తెలంగాణ ప్రాంతంలో భారీ వర్షాలు, వరదలకు దిగువన ఉన్న తిరువూరు మండలంలోని పలు చెరువులు, వాగుల్లో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. తిరువూరుకు సమీపంలోని తెలంగాణ రాష్ట్రంలోని లంకాసాగర్‌కు 3270 క్యూసెక్కుల నీరు వస్తుండటంతో కట్టలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. గంపలగూడెం మండలం వినగడప వద్ద డైవర్షన్ రహదారిపై వరదనీరు పరవళ్లు తొక్కుతోంది. చెరువులన్ని సామర్థ్యానికి మించి ప్రవహిస్తున్నాయి. కనుగుల చెరువు-మల్లమ్మచెరువుల మధ్య అక్కపాలెం రోడ్డులో వరదనీరు ప్రవహిస్తున్నది. చెరువుల కట్టలకు గండ్లు పడతాయనే భయందోళన ఆయకట్టు రైతుల్లో నెలకొంది. ఇప్పటికే పోతుల చెరువు సమీపంలో కట్టుకల్వకు గండి కొట్టి వరదనీటిని వాగుకు మళ్లించారు. అక్కపాలెం- తిరువూరు మధ్య పడమటి వాగు చప్టాపై వరదనీరు ప్రహించడంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండంతో పాటు, చెరువుల అలుగులు పారుతున్నాయి. ఆయకట్టు పరిధిలోని కొన్ని పొలాల్లో భారీగా నీరు చేరడంతో రైతులు పొలం కట్టలకు గండ్లు పెడుతూ నీటిని బయటకు పంపే చర్యలు చేపట్టారు.

తిరువూరు/కంచికచర్ల/వత్సవాయి/పెనుగంచిప్రోలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):

ఉధృతంగా మునేరు..

మునేరుకు ఎగువ నుంచి ఉధృతంగా వరద వస్తుండటంతో గంట గంటకు ప్రవాహం పెరుగుతోంది. తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉదయం ఆరు గంటలకు వత్సవాయి మండలం పోలంపల్లి ఆనకట్ట వద్ద 3,171 క్యూసెక్కులున్న వరద మధ్యాహ్నం 12.30 గంటలకు 11,573 క్యూసెక్కులకు చేరింది. సాయంత్రం ఆరుగంటలకు 25,374 క్యూసెక్కులకు పెరిగింది. చిల్లకల్లు - వైరా రూటులో లింగాల వద్ద కాజ్‌వేను ఆనుకుని మునేరు ప్రవహిస్తున్నది. ఏ క్షణమైనా వరద కాజ్‌వే పైకి చేరి.. మరో ఐదు వేల క్యూసెక్కులు పెరిగితే రహదారిలో వాహనాల రాకపోకలు స్తంభించనున్నాయి. తెలంగాణా రాష్ట్రం ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో వచ్చే మూడు రోజులు విస్తారంగా వర్షాలు పడతాయని వాతావరణశాఖ హెచ్చరిస్తున్నందున మునేరు ఉగ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని చెబుతున్నారు. వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు మండలాల అధికార యంత్రాంగం పునరావాస కేంద్రాల ఏర్పాటుతో పాటుగా ఎలాంటి నష్టం జరగకుండ చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

● వైరాయేరు, కట్లేరుల వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. నందిగామ మండలం దాములూరు కూడలి కాజ్‌వేపై మూడు నాలుగు అడుగుల ఎత్తున వరద నీరు ప్రవహిస్తున్నది. వరద పోటెత్తటంతో



ఉధృతంగా ప్రవహిస్తున్న కట్టలేరు వాగు

కూడలి మార్గం పదిరోజుల నుంచి బంద్ అయింది. వీరులపాడు, నందిగామ మండలాల మధ్య, ఖమ్మం జిల్లా మధిరకు వాహనాలు నడవటం లేదు. సమీప గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

● కృష్ణానదికి ఎగువ నుంచి మూడు లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నది. మునేరు, వైరాయేరు, కట్లేరుల వరద కూడా కలుస్తుండటంతో కృష్ణానదికి వరద పెరుగుతోంది. తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటుగా నదిలోకి దిగవద్దని, చేపల వేటకు వెళ్లవద్దని, పడవలు నడపరాదని నందిగామ ఆర్డీవో బాలకృష్ణ సూచించారు. క్షేత్రస్థాయి అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

లింగాల కాజ్‌వే వద్ద..

పోలంపల్లి ఆనకట్ట వద్ద వరద 10 అడుగులకు చేరింది. ఆనకట్ట వద్ద మరో 2 అడుగులు పెరిగితే లింగాల కాజ్‌వే పైకి వచ్చే అవకాశం ఉందని మునేరు ఏఈ రామనరసింహ తెలిపారు. తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎస్ఐ ఉమామహేశ్వరరావులు పరిస్థితి పరిశీలించి సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేశారు.

పెనుగంచిప్రోలు తహసీల్దార్ శాంతి లక్ష్మీ, రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేశారు. ఎస్ఐ ఎంఎస్‌కె



కాజ్‌వే వద్ద మునేటి వరద ఉధృతి

అర్జున మునేటి వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా సిబ్బందిని అప్రమత్తం చేశారు.

మళ్లీ పెరిగిన వరద

అవనిగడ్డ రూరల్ : ఎగువ నుంచి మళ్లీ వరద నీరు విడుదల చేయటంతో పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం 3 లక్షల 28 వేల క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవాహిస్తోంది. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు.

కొణిజర్ల-నెమలి గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు

కొణిజర్ల(గంపలగూడెం) : అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు, వాగులు, చెరువుల అలుగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సోమవారం మండలంలోని కొణిజర్ల-నెమలి మధ్యలో గల నల్లవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో, ఈ రహదారిలో ఉదయం నుంచి రాకపోలు నిలిచిపోయాయి.



కనుగులచెరువు-మల్లమ్మ చెరువు మధ్య రోడ్డుపై నీటి ప్రవాహం

బాబు.. బంగారం




సీఎంగా చంద్రబాబు 30 ఏళ్ల ప్రస్థానంపై నేతల మనోగతం..

దార్శనిక నేత : ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల



మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నారా చంద్రబాబు నాయుడు 1995 సెప్టెంబరు 1న తొలిసారిగా ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారని, తెలుగు నేలపై నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా, 14 ఏళ్ల 11 నెలలు (5,442 రోజులు) పనిచేసిన ఏకైక సీఎంగా రికార్డు సృష్టించిన ఘనత చంద్రబాబుకే దక్కిందని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. 15 ఏళ్ల కాలంలో రాష్ట్రంతో పాటు దేశ రాజకీయాల్లో అనేక సంక్షోభాలను పరిష్కరించిన అపర చాణక్యుడిగా చంద్రబాబు జాతీయస్థాయిలో పేరు గాంచారన్నారు. విజనరీ అన్న పదానికి నిర్వచనం చంద్రబాబు అనడంలో అతిశయోక్తి లేదన్నారు. నాడు హైదరాబాద్‌లో హైటెక్ సిటీ, నేడు అమరావతిలో క్వాంటం వ్యాలీకు రూపకల్పన చేసిన దార్శనికత ఆయన సొంతమన్నారు.


విజనరీ లీడర్ : ఎమ్మెల్యే బొండా ఉమా



అజిత్‌సింగ్‌నగర్ : క్రమశిక్షణ, దూరదృష్టి కలిగిన నేత.. విజనరీ లీడర్ ముఖ్యమంత్రి చంద్రబాబు అని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన ప్రయాణంలో అనేక ఒడిదుడుకులు అధిగమించారన్నారు. తీవ్ర ఆర్థిక సంక్షోభాలు, విద్యుత్ కోతలు వంటి అనేక సవాళ్లను ఎదుర్కొని పాలనను గాడిలో పెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ప్రపంచపటంలో నిలబెట్టనున్నారన్నారు. చంద్రబాబు నేటి తరం నాయకులకు ప్రేరణగా నిలుస్తారన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి

- ఎమ్మెల్యే వసంత



మైలవరం : రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు 74 ఏళ్ల వయసులోనూ యువకుడిలా అహర్నిశలు శ్రమిస్తున్నారని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కొనియాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. 74 సంవత్సరాల వయసులో నవ యువకుడిలా ఎంతో శ్రమిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు దృఢ సంకల్పం ముందు వైసీపీ కుయుక్తులు పారవన్నారు.

జగన్.. వైఖరి మార్చుకో

- ఎమ్మెల్యే యార్లగడ్డ



గన్నవరం : అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. క్రమం తప్పకుండా అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతూ ప్రజా సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తున్న చంద్రబాబును చూసైనా జగన్మోహన్ రెడ్డి తన వైఖరిని మార్చుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హితవు పలికారు. నిడమానూరులో సోమవారం యార్లగడ్డ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పదవి స్వీకరించి 30 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈనెల 18నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాలకు జగన్ రెడ్డితో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావించాలని సూచించారు. అసెంబ్లీకి రాని మాజీ ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో మిగిలిపోతారేమోనని ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబు పరిపాలనా దక్షతతో రాష్ట్రంలో సంపద సృష్టించడం ద్వారా సంక్షేమ పథకాల అమలు చేస్తూనే అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు.



విజయవాడ ఎంపీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్

తెలుగు రాష్ట్రాలకు గర్వకారణం..


- మాజీ మంత్రి దేవినేని ఉమా



గొల్లపూడి : చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నేటికి 30 ఏళ్లు పూర్తవడం తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ప్రజలకు ఆశాకిరణంలా చంద్రబాబు నిలిచారన్నారు. చంద్రబాబు దూరదృష్టి వల్లే హైదరాబాద్ గ్లోబల్ సిటీగా ఎదిగిందన్నారు. నేడు అమరావతిలో క్వాంటం వ్యాలీ నిర్మాణానికి రూపకల్పన చేస్తు భవిష్యత్‌తరాలకు అవకాశాలు, అధునాతన టెక్నాలజీ పరిశ్రమలకు కేంద్రంగా ఏపీని తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు.

చంద్రబాబు కృషికి తార్కాణం..

ఎమ్మెల్యే కొలికపూడి



తిరువూరు : ఎవరు ఎన్ని అటంకాలు సృష్టించినా మొక్కవోని దీక్షతో అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయాణం కొనసాగుంతుందని.. నాటి హైటెక్ సిటీ నుంచి నేటి అమరావతి రాజధాని వరకు ఆయన కృషికి తార్కాణమని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. ముఖ్యమంత్రిగా ప్రవేశ పెట్టిన వివిధ పథకాలు, బడుగు బలహీన వర్గప్రజలకు భరోసా కల్పించాయన్నారు.

అభివృద్ధికి నిర్వచనం : శావల దేవదత్



అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిర్వచనం చంద్రబాబు అని రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ చైర్మన్ శావల దేవదత్ అన్నారు. భవిష్యత్‌తరాలకు సంక్షేమ ఫలాలు అందించాలనే, విజన్‌తో చంద్రబాబు ముందుకు సాగుతున్నట్టు తెలిపారు. సాంకేతిక రంగాన్ని యూవతకు అందించడంతో పాటుగా, సంక్షేమాన్ని ప్రజల ముంగిటకు తెచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు.

రాష్ట్రాభివృద్ధే ధ్యేయమైన గొప్ప నేత

- మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ : రాష్ట్రాభివృద్ధి కోసం జీవితాన్నే అంకితం చేసి పనిచేస్తున్న గొప్ప నేత చంద్రబాబు అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావులు అన్నారు. కేక్ కట్‌చేసి అభిమానులకు పంచి పెట్టి.. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, ప్రపంచంలో వస్తున్న పరిణా



మాలు ముందుగానే గమనించి ఐటీ అభివృద్ధికి బాటలు వేశారని, నాటి ముందుచూపే నేడు పేద, మధ్య తరగతి కుటుంబాల్లో వెలుగులు నింపాయని తెలిపారు. చంద్రబాబు వంటి దార్శనికుడైన వ్యక్తి మరో 15 ఏళ్లు పాటు అధికారంలో ఉండాలని కనపర్తి శ్రీనివాసరావు ఆశాభావం వ్యక్తం చేశారు.

అభివృద్ధే ధ్యేయంగా..

- ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్



పెడన రూరల్ : నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌ను ఎంతో అభివృద్ధి చేసిన వ్యక్తి చంద్రబాబు.. అని అభివృద్ధే ధ్యేయంగా ఉద్యోగ, ఉపాధి రంగాలల్లో తనదైన శైలిలో అభివృద్ధి చేసి చూపించారని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఉన్నప్పటికి, సకాలంలో అమరావతి, పోలవరం పూర్తిచేయాలన్న సంకల్పంతో పనిచేస్తున్నారన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ఘనత చంద్రబాబుదే

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

వన్‌టౌన్ : సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఘనత చంద్రబాబుకే దక్కిందని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. గురునానక్ కాలనీలో పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం టీడీపీ నాయకులు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ పార్టీ నాయకుల సమక్షంలో కేక్ కట్‌చేసి సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్‌లు గొట్టుముక్కల రఘురామరాజు, పేరేపి ఈశ్వర్, తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్‌లోని జిల్లా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఎన్టీఆర్ జిల్లా బీసీ గౌడ సాధికారిక కన్వీనర్ పామర్తి కిషోర్ బాబు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి దుర్గారావు, నాయకులు గొల్లపూడి నాగేశ్వరరావు, మల్లెల విజయకుమార్, గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తు స్వరూపం!

(5వ పేజీ తరువాయి)

హవీల వద్ద ఉన్న ఎల్ఎస్‌డీ అతడిదేనని తేలిపోయింది. శ్రీవాత్సవ్‌తో లింక్‌లు ఉన్న లోహిత్ యాదవ్‌ను మాచవరం పోలీసులు ఒకటో ఏసీఎంఎం కోర్టులో సోమవారం హాజరుపరిచారు. అతడికి పోలీసులు 12వ తేదీ వరకు రిమాండ్ విధించింది.

ఇదీ లోహిత్ చరిత్ర

విశాఖపట్నం గొల్లపాలెం ప్రాంతానికి చెందిన జోగా లోహిత్ యాదవ్ ఖాళీగా ఉంటున్నాడు. అతడి తండ్రి వెంకట శ్రీనివాస్ విశాఖ మహానగర పాలక సంస్థలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. లోహిత సోదరుడు వెంకట జయ శ్రావణ్ ఇంజనీరింగ్ పూర్తిచేసి విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నాడు. ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో వేసవి సెలవుల్లో డ్రగ్స్‌కు అలవాటుపడ్డాడు. బీవీకే కళాశాలలో డిగ్రీలో చేరిన లోహిత్ కొద్దిరోజుల క్రితమే విద్యను మధ్యలో ఆపేశాడు. అక్కడే స్నేహితుల ద్వారా ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్స్‌ను అలవాటు చేసుకున్నాడు. కళాశాల విద్యను ఆపేసిన లోహిత ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. ఆ క్రమంలోనే శ్రీవాత్సవ్, స్వరూపరాజుతో పరిచయం ఏర్పడింది. డ్రగ్స్ విక్రయించే వారితో స్వరూపరాజుకు విస్తృత పరిచయాలు ఉన్నాయి.

పెరిగిన స్త్రీ శక్తి!

(5వ పేజీ తరువాయి)

దాటి వెళుతుంది. విజయవాడ నుంచి మైలవరం, నూజివీడు, నున్న, ఆగిరిపల్లి, గన్నవరం, హనుమాన్ జంక్షన్, అమరావతి, మంగళగిరి, కంకిపాడు, ఉయ్యూరు, పామర్రు వరకు నలువైపులా సబర్బన్ పరిధి ఉంది. ఈ సబర్బన్ లిమిట్స్‌లో సిటీ ఆర్డినరీలు, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుస్తున్నాయి. పల్లె వెలుగు బస్సులు ఎలాగూ ఉంటాయి. ఉచిత ప్రయాణం కాబట్టి మహిళలు సౌకర్యవంతంగా ఉండే మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను ఎక్కువగా ఎంపిక చేసుకుంటున్నారు. ఆ తర్వాత సిటీ బస్సులను ఎంపిక చేసుకుంటున్నారు. సబర్బన్ పరిధిలో రూరల్ ప్రాంతాలలో ఉండే మహిళలు ఎక్కువగా విజయవాడలో ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రధానంగా ప్రైవేటు కంపెనీలలో పనిచేస్తున్నారు. ఆ తర్వాత షోరూమ్‌లు, మాల్స్ సూపర్ బజార్స్, సినిమా థియేటర్లు, వస్త్ర దుకాణాలు, బంగారు దుకాణాలు, ఫ్యాక్టరీలు, స్వీట్ షాపులు, ప్రింటింగ్ ప్రెస్‌లు, డెయిరీ, సెక్యూరిటీ సంస్థలలో పనిచేస్తూ ఉపాధి పొందే వారు చాలా మంది ఉన్నారు. వీరంతా గతంలో ఆటోలను ఆశ్రయించేవారు. ప్రస్తుతం ఉచిత ప్రయాణం కాబట్టి అవసరమైతే ఒక గంట ముందే బస్టాపులకు వచ్చి బస్సుల కోసం ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది. వీరు కాకుండా విజయవాడ షాపింగ్ చేయటానికి వచ్చే మహిళల సంఖ్య ఇటీవల కాలంలో పెరిగిపోయింది. మార్టులకు వచ్చి సరుకులు తీసుకునేందుకు కూడా సాధారణ గృహిణులు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. దీంతో మహిళా ప్రయాణీకుల సంఖ్య రూరల్ ప్రాంతాల నుంచి విజయవాడకు గణనీయంగా పెరిగింది. జిల్లా బస్సులలో గతం కంటే 5 శాతం మాత్రమే మహిళా ప్రయాణికులు పెరిగారు.

కేటుగాళ్లు!

(5వ పేజీ తరువాయి)

కుమారుడు కన్నేశాడు. ఆయా స్థలాలను దౌర్జన్యంగా ఆక్రమించుకుని వేరే ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నాడు. అంతటితో ఆగకుండా ఆక్రమించుకున్న స్థలాలకు రిజిస్ట్రేషన్ రికార్డుల ప్రకారం పన్నులు వేయాలని సచివాలయ సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నాడు. ఇతని ప్రతిపాదనలను తిరస్కరించిన సచివాలయ సిబ్బందిని సచివాలయంలోనే ఉంచి ఇటీవల తాళం వేసి భయభ్రాంతులకు గురి చేశాడు.

» నగరంలోని హిందూ కళాశాల, నోబుల్ కళాశాల సమీపంలో రెండు గృహ సముదాయాలకు సెట్ బ్యాక్ వదలకుండానే నిర్మాణం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో కొందరు తమదైన శైలిలో మునిసిపల్ కార్యాలయ టౌన్ ప్లానింగ్ అధికారులపై ఒత్తిడి తెచ్చి అనుమతులు ఇప్పించారనే ఆరోపణలు ఉన్నాయి.

» కాలేఖాన్‌పేట మురుగు కాల్వ వంతెనకు అత్యంత సమీపంలో మునిసిపల్ స్థలం ఉంది. ఇక్కడ మునిసిపాల్టీకి చెందిన రెండు సెంట్ల స్థలాన్ని రూ.13 లక్షలకు స్థానిక నాయకులు బేరం పెట్టారు. మునిసిపల్ అధికారులకు చెప్పి, వారి అనుమతులు తీసుకుని మరీ ఈ స్థలం విక్రయానికి పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ స్థలం విక్రయానికి సంబంధించి రూ.5లక్షల అడ్వాన్సుగా కూడా తీసుకున్నట్లు స్థానికులు చెప్పుకుంటున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్ 122, 131, 142

చికెన్ విత్ స్కిన్ 232

చికెన్ స్కిన్‌లెస్ 242

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 570



యూరియా కొరత లేదు.. రైతులు ఆందోళన చెందొద్దు : ఏడీఏ

విజయవాడ రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విజయవాడ రూరల్ మండలం పరిధిలో యూరియా కొరత లేదని రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని వ్యవసాయశాఖ విజయవాడ డివిజన్ అసిస్టెంట్ డైరక్టర్ (ఏడీఏ) బి. వెంకటేశ్వరరావు అన్నారు. నున్న పీఏసీఎస్‌లో యూరియా పంపిణీ ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. డీఎస్పీ యూ. బంగారాజు, విజిలెన్స్ ఏతఈ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



నిరుద్యోగ యువతకు శిక్షణ

గన్నవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ప్రిన్సిపాల్ వివి కృష్ణమోహన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు శిక్షణా ఉంటుందన్నారు. ఇంటర్ ఆపైన చదువుకుని 35ఏళ్ల లోపు ఉన్న యువతీ యువకులు అర్హులని చెప్పారు. ఆఫీస్ అసిస్టెంట్, ఎంఎస్ ఆఫీస్, టైపింగ్ నేర్పిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు 94940-05725 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు సుహాసిని

100 మందికి వైద్యపరీక్షలు

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏలూరు రోడ్డు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బాపులపాడు మండల ఆర్య వైశ్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ హోమియో వైద్యులు డి. సుహాసిని 100 మంది రోగులను పరీక్షించారు. నరేష్ హోమియో స్టోర్సు నిర్వాహకులు ఎన్. విష్ణువర్ధన్ ఉచితంగా మందులు అందజేశారు. ట్రస్ట్ నిర్వాహకులు నారికమల్లి ప్రసాద్, గార్లపాటి రామకృష్ణ, వెత్సా వెంకటేశ్వరరావు, బొమ్మిశెట్టి రామారావు, శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



షేక్ బాజీ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ముస్లింలు

టీడీపీ నేత షేక్ బాజీకి ఘన నివాళి

కంకిపాడు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకులు షేక్ బాజీ అంతిమయాత్ర కంకిపాడులో సోమవారం జరిగింది. ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో పాటు టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, పులి శ్రీనివాసరావు, గోగినేని వెంకటరమణ, కొండా నాగేశ్వరరావు, చిట్టూరి నాగేశ్వరరావు, వణుకూరు విక్రం, ఏనుగ జయప్రకాష్, నన్నా సాహెబ్, అన్నే రామారావు, డీఎస్ఆర్ తదితరులు బాజి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాజీ అంతిమయాత్రలో పెద్దఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.

గన్నవరం ఏజీపీ నీరజకు అదనపు బాధ్యతలు

గన్నవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం ఏజీపీగా పని చేస్తున్న సీనియర్ న్యాయవాది ఎస్జీజీ నీరజకు బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా అదనపు బాధ్యతలు ఇస్తూ కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఇప్పటికే గన్నవరంతో పాటు, ఉయ్యూరు ఏజీపీగా పని చేస్తున్నారు. మూడో కోర్టుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

నేడు విద్యుత్ నిలిపివేత

ఉంగుటూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు తేలప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని తేలప్రోలు, బండారుగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు గుడివాడ డివిజన్ ఈఈ జీబీ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మల్లవల్లి చెరువులో చేపలు మృతి

- వెదజల్లుతున్న దుర్గంధం
- పట్టించుకోని అధికారులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : మల్లవల్లిలోని పంచాయతీ చెరువులో చేపల పెంపకం దారుడు మృతి చెందిన చేపలను వదిలి వేయడంతో దుర్గంధం వెదజల్లుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మల్లవల్లి చెరువు పాటదారుడు(శనివారం) చేపలు పట్టాడని, అందులో గురకలు(చిన్న చేపలు) రావడంతో సంచుల్లో అలాగే చెరువులో వదిలి పెట్టేసారని గ్రామస్తులు తెలిపారు. సంచుల్లోని చేపలు మృతి చెంది కుళ్లిపోయి దుర్గంధం వ్యాపిస్తోందని తూము లోకేశ్వరరావు, అక్కినేని నాగరాజు, నాగేశ్వరరావు తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే చంద్రబాబు ధ్యేయం

చంద్రబాబు తొలిసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టి 30 ఏళ్లయిన సందర్భంగా పోరంకి టీడీపీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించిన పార్టీ శ్రేణులు



చంద్రబాబు ముఖ్యమంత్రి పదవి చేపట్టి 30 ఏళ్లయిన సందర్భంగా కేకును కోస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. చంద్రబాబు తొలిసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టి 30 ఏళ్లయిన సందర్భంగా పోరంకి టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ శ్రేణులతో కలిసి కేకు కోసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో అగ్రస్థానాన నిలబెట్టే తపనతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన చంద్రబాబు రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్రను అదే పథంలో ముందుకు తీసుకెళుతూ విభజిత రాష్ట్రాన్ని నెంబర్‌వన్‌గా నిలబెట్టాలన్న తపనతో అనునిత్యం పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువనేత బోడె వెంకట్రాం, అనుమోలు ప్రభాకరావు, మారుపూడి ధన కోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, సంగెపు రంగారావు, శొంఠి శివరాంప్రసాద్, బొంగరాల అబ్రహాం తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల పనులకు శంకుస్థాపన

తాడిగడప మునిసిపాలిటీ ఇందిరా నగర్2, పోరంకిలోని దీపికా మెడోస్ ప్రాంత రోడ్ల నిర్మాణానికి 72.5 లక్షల వ్యయ అంచనాతో రోడ్ల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెనమలూరు నియోజకవర్గం, తాడిగడప మునిసిపాలిటీల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు తాను ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. వచ్చే నాలుగేళ్లలో నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రజల ఇబ్బందులు తీర్చే పనిలో నిమగ్నమై ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు అనుమోలు ప్రభాకరరావు, అనంతనేని ఆజాద్, శొంఠి శివరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు సీహెచ్‌సీ అభివృద్ధికి రూ. 5.75 కోట్లు

కంకిపాడు: కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) అభివృద్ధికి ఆరోగ్య శాఖ రూ. 5.75 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ కమిషనర్ రూ. 5.75 కోట్ల మంజూరు చేసినట్లు తెలియజేశారు. ఈ నిధులతో ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన మార్చురీ, బెడ్స్, అదనపు భవన నిర్మాణాలకు ఈ నిధులు వినియోగించనున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ శ్మశాన వాటికకు స్థలం కేటాయిస్తా

మండలంలోని ఉప్పలూరు గ్రామంలో ఎస్సీలకు అవసరమైన శ్మశాన వాటికకు అవసరమైన స్థలాన్ని కేటాయించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ హామీ ఇచ్చారు. ఉప్పలూరు గ్రామస్థులు సోమవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను కలిసి ఉప్పలూరు ఎస్సీలకు అవసరమైన శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పలూరు గ్రామస్థులు పాల్గొన్నారు.



బాపులపాడు.. కాకులపాడు.. ఆకునూరులో పింఛన్ల పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

కూటమి పాలనలో దండిగా పింఛన్ల పంపిణీ



నిడమానూరులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు.. ఉయ్యూరులో పింఛను పంపిణీ చేస్తున్న వైవీబీ రాజేంద్రప్రసాద్

గన్నవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో సోమవారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. నెహ్రూనగర్‌లో రూ.కోటి వ్యయంతో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డు, సీసీ డ్రైన్లను మాజీ ఎమ్మెల్యే ముద్దర బోయిన వెంకటేశ్వరరావుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ, మొదటిసారి ముఖ్యమంత్రి పదవిని స్వీకరించి 30 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా చంద్రబాబు నాయుడుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఏఎంసీ ఛైర్మన్ గూడవల్లి నరసయ్య, టీడీపీ మండల అధ్యక్షులు గొడ్డళ్ల చిన్న రామారావు, గూడపాటి తులసి మోహన్, దయ్యాల రాజేశ్వరరావు చిరుమామిళ్ల సూర్యం, ఆళ్ల గోపాలకృష్ణ, మూల్పూరి సాయి కళ్యాణి, బండి వెంకట్రావు, సాంబశివరావు, యోగేంద్ర, మాదల నాని బాబు, గండికోట సీతయ్య పాల్గొన్నారు.

● అర్హులైన ప్రతి ఒక్కరికీ కూటమి ప్రభుత్వం పెన్షన్‌లు అందజేస్తుందని ఎంపీటీసీ సభ్యుడు పడమట రంగారావు అన్నారు. స్థానిక గౌడపేటలో సోమవారం పెన్షన్‌లను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు మోర్ల నాగబాబు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా తొలి రోజు 93.36శాతం పెన్షన్‌లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో టి.స్వర్ణలత తెలిపారు.

హనుమాన్‌జంక్షన్: సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ సోమవారం బాపులపాడులో టీడీపీ నేతలు నిర్వహించారు. టీడీపీ జంక్షన్ పట్టణ అధ్యక్షుడు ఆట్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి, గ్రామ ఉపసర్పంచ్ దుట్టా శివన్నారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జి చిన్నాల లక్ష్మీనారాయణ, కర్రా ప్రసాద్‌పాల్, పొట్లూరి ఫణి, ముత్యాల సువర్ణరాజు, చీలి ఆనంద్, కంచర్ల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు దివ్యాంగులకు, వృద్ధులకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నాయని ఎన్ఎస్ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, డీసీ ఛైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, రైతు నాయకులు గుండపనేని ఉమావరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు వేర్వేరు కార్యక్రమాల్లో అన్నారు. బాపులపాడు మండల వ్యాప్తంగా సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. రంగన్నగూడెం, కాకులపాడు, ఆరుగొలను, కొత్తపల్లి, రామన్నగూడెం వీరవల్లిలో పింఛన్లు పంపిణీ చేశారు.

ఉయ్యూరు: పెన్షన్లు తీసివేస్తున్నారని వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఉయ్యూరు 3, 12, 17 వార్డుల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని సోమవారం ప్రారంభించారు. మాజీ ఛైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, ఫణి, నాగరాజు, నరేశ్, అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

● ఆకునూరులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు దండమూడి చౌదరి సర్పంచ్ గోలి వసంతకుమార్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ రూ. 4వేలకు పెంచి అర్హులందరికి అందచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు అండగా నిలవాలన్నారు. పార్టీ నాయకులు వెంకన్న, తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ రామారావు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

ఉయ్యూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్‌మోసాల పట్ల అప్రమత్తతగా ఉండాలని ఉయ్యూరు సీఐ టీవీవీ రామారావు అన్నారు. శ్రీశ్రీనివాస కళాశాలలో సోమవారం రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వర్క్‌షాప్‌లో సీఐ రామారావు, ఇండియన్ బ్యాంక్ బ్రాంచి మేనేజర్ అజయ్‌కుమార్ పాల్గొని విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగించారు. బ్యాంకుల్లో లభించే అనేక సేవలపట్ల అవగాహన కలిగి ఉండాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ కె.రాహుల్ అన్నారు. బ్యాంకింగ్ సెక్టర్స్‌లో దబ్బులు వినియోగించడం, పొదుపు చేయడంపై ఉయ్యూరు బార్ కౌన్సిల్ అధ్యక్షుడు కాగిత గోపీచంద్ అవగాహన కల్పించారు. కాటూరు ఇండియన్ బ్యాంక్ మేనేజర్ సీహెచ్ పావని, ఏపీఎం అమలేశ్వ రరావు, వర్క్‌షాప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి. ఆంజనేయులు, మేనేజర్ వి. అశోక్‌కుమార్, రిసోర్స్ పర్సన్ బాబూరావు, శ్రీనివాస కళాశాల డైరెక్టర్ పరుచూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందడం అభినందనీయం



ఉయ్యూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగిగా విధి నిర్వహణలో ప్రజలకు సేవలందించి మన్ననలు పొందడం అభినందనీయమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండల పరిషత్ పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన రాజులపాటి రాఘవరాకు స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో ఏర్పాటుచేసిన ఉద్యోగ విరమణ అభినందన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాఘవరావు దంపతులకు పుష్ప గుచ్చం అందచేసి, దుశ్శాలువాతో సత్కరించారు. గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి, తోట్లవల్లూరు జడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి, మూడే శివశంకర్, ఉయ్యూరు ఎంపీడీవో శేషగిరిరావు, ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొని రాఘవరావును సత్కరించారు.

స్మార్ట్ మీటర్ పెడితే బిల్లు అదానికి కట్టాల్సిందే

గన్నవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తయారు చేసేది ప్రభుత్వం దానిని సరఫరా చేసేది ట్రాన్స్‌కో సమస్య వస్తే పరిష్కరించేది అధికారులని కానీ స్మార్ట్ మీటర్ పెడితే బిల్లు కట్టించుకునేది అదాని అని ఇది రానున్న రోజుల్లో పరిస్థితి ఈ విధంగా ఉంటుందని యూటీఎఫ్ మాజీ జిల్లా నాయకులు కర్రా వరప్రసాద్ అన్నారు. ఈ ప్రమాదాన్ని ప్రజలంతా ముందే గుర్తించాల్సిన అవసరం ఉందని చెప్పారు. సోమవారం స్థానిక ఆట్లూరి శ్రీమన్నారాయణ మీటింగ్ హాలులో యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్టడీ సర్కిల్ జరిగింది. దీనికి ఐలూ నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్ మాట్లాడుతూ, పాలకులు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడానికి ప్రయత్నిస్తున్నారని, అందులో భాగంగానే విద్యుత్ రంగంలో స్మార్ట్ మీటర్ల బిగింపు వ్యవస్థను తెచ్చారన్నారు. ఇప్పటికే మీటర్లు బిగించిన షాపులకు వ్యాపార సంస్థలకు బిల్లుల మూత మోగుతుందని తెలిపారు.

వైభవంగా గణనాథుని ఉత్సవాలు

గన్నవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీకాశీ విశాలాక్షి అన్నపూర్ణాదేవి సహిత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో గణపతి నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం కాసన్నేని రాజ మణీంద్ర, వెంకట పద్మప్రియ దంపతులు స్వామివారికి విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. కొత్తపేటలోని ఏర్పాటు చేసిన విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనం చేశారు. దావాజీ గూడెం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఉయ్యూరు : గణేశ్ మండపాలు పెద్దయెత్తున ఏర్పాటు చేసి పూజలు చేయడం శుభసూచికమని మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఉయ్యూరులో చింతలతోట ఫ్రెండ్స్ సర్కిల్ గణేశ్‌కమిటీ మండపం వద్ద భారీ అన్నసమారాధన సోమవారం ఆయన ప్రారంభించారు. మాజీ ఛైర్మన్ పూర్ణచంద్రరావు, కుటుంబరావు, నరేశ్ ఉమా పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వినాయకుని నిమజ్జనోత్సవాలు అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. పెరికీడు వద్ద గల ఏలూరు కాలువలో నిమజ్జనానికి తరలివచ్చిన గణనాథుని విగ్రహాలను భారీ క్రేన్ల సాయంతో ఎస్సై సురేష్ పర్యవేక్షణలో పోలీసుల బందోబస్తు మధ్య ఆదివారం రాత్రి నుంచి నిర్వహిస్తున్నారు. వీరవల్లి ఎస్సై శ్రీనివాస్ పర్యవేక్షణలో క్రేన్లను ఏర్పాటు చేసి భక్తులను కాలువల్లో దిగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

కంకిపాడు : స్థానిక రెండవ వార్డులో రాయల్స్ ఫ్రండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఘననాథుడి విగ్రహాన్ని సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు, చిట్టూరి నాగేశ్వరరావు, వీరంకి శ్యామ్ పాల్గొన్నారు.



కానూరు బందరురోడ్డులోని రెస్టారెంట్‌లో పారిశుధ్య నిర్వహణపై సూచనలు చేస్తున్న మునిసిపల్ కమిషనర్ షేక్ నజీర్

హోటళ్లు, రెస్టారెంట్‌ల్లో ఆకస్మిక తనిఖీ

● పారిశుధ్యం మెరుగుపరచాలని కమిషనర్ సూచన

కానూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ తన సిబ్బందితో సోమవారం కానూరు పంటకాలువ రోడ్డు, బందరు రోడ్డుల్లోని పలు రెస్టారెంట్‌లు, హోటళ్లల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా హోటళ్లు, రెస్టారెంట్‌ల్లో పారిశుధ్య నిర్వహణ, సింగిల్ యూసేజ్ గ్లాస్‌లు, ప్లేట్‌లు, స్పూన్‌లు వినియోగం ఏవిధంగా ఉంది, వంటశాలలో పారిశుధ్య నిర్వహణ ఎలా ఉంది, క్లినింగ్ ఎలా చేస్తున్నారు తదితర అంశాలపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన హోటళ్లు, రెస్టారెంట్ నిర్వాహకులకు పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ తనిఖీల్లో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఐసీ దేశానికే గర్వకారణం

గన్నవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ సంస్థ దేశానికే గర్వకారణమని గన్నవరం బ్రాంచ్ మేనేజర్ జేఎస్ శ్రావణ్‌కుమార్ అన్నారు. ఎల్ఐసీ 69వ వార్షికోత్సవ సంబరాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రైడ్ ఆఫ్ ఇండియాగా పేర్కొనబడుతున్న ఎల్ఐసీ రూ.56 లక్షల కోట్ల ఆస్తులు, 48లక్షల కోట్లు లైఫ్ ఫండ్ ఆస్తులు కలిగి ఉందన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో 91.88 శాతం పెన్షన్ల పంపిణీ

విజయవాడ సిటీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ సోమవారం సాయంత్రానికి 91.88 శాతం పూర్తి చేసినట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏఎన్వీ నాంచారరావు తెలిపారు. అత్యధికంగా మైలవరం మండలంలో 94.21 శాతం, అత్యల్పంగా చందర్లపాడు మండలంలో 88.69 శాతం పూర్తి చేసినట్లు వివరించారు. ఎ.కొండూరులో 94.14, విస్సన్నపేటలో 93.43, జి.కొండూరులో 93.36, ఇబ్రహీంపట్నంలో 92.86, తిరువూరు అర్బన్‌లో 92.76, రెడ్డిగూడెంలో 92.54, నందిగామ అర్బన్‌లో 92.32, విజయవాడ అర్బన్‌లో 92.31, తిరువూరులో 92.13, కంచికచర్లలో 92.05, వత్సవాయిలో 91.47, జగ్గయ్యపేట అర్బన్‌లో 91.43, కొండపల్లి అర్బన్‌లో 91.41, జగ్గయ్యపేటలో 91.01, వీరులపాడులో 90.98, గంపలగూడెంలో 90.84, విజయవాడ రూరల్‌లో 90.8, నందిగామలో 90.62, పెనుగంచిప్రోలులో 90.34 శాతం పెన్షన్ పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

ఎన్ఆర్ఐలో ఘనంగా ఎఫ్‌డీపీ ప్రారంభం

విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆరు రోజుల పాటు నిర్వహించనున్న 'అడ్వాన్స్‌డ్ వీఎల్ఎస్ఐ డిజైన్ అండ్ ఏఐ ఎనేబుల్డ్ ఆటోమేషన్ ఫర్ నెక్స్ట్ జనరేషన్ సెమికండక్టర్ మాన్యుఫాక్చరింగ్' అంశంపై ఫ్యాకల్టీ డెవలెప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఏఐసీటీఈ-ఏటీఏఎల్ స్పాన్సర్‌గా వ్యవహరించింది. దేశవ్యాప్తంగా వివిధ ఇంజినీరింగ్ కాలేజీల అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీన్, ఈసీఈ విభాగాధిపతి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అధ్యాపకుల నైపుణ్యాలను పెంపొందించడం, వీఎల్ఎస్ఐ, కృత్రిమ మేధస్సు రంగాల్లో తాజా పరిశోధనలు, రూపకల్పన పద్ధతులు, అధునాతన తయారీ ప్రక్రియలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఆర్.వెంకటరావు, ప్రిన్సిపాల్ సి.నాగభాస్కర్, అకడమిక్ డైరెక్టర్ జి.సాంబశివరావు, ఆర్అండ్‌డీ డీన్ కేవీ సాంబశివరావు, ఈసీఈ హెచ్‌వోడీ కె.రామాంజనేయులు, కో-కోఆర్డినేటర్ వై.అర్పిత, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ఎన్వీ సురేంద్రబాబు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

● ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ కేంద్రాలకు డీఎంహెచ్‌వో హెచ్చరిక

విజయవాడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సరోగసి విధానంలో ప్రభుత్వ నియమాలకు విరుద్ధంగా ఏ ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ కేంద్రాలు వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యశాఖాధికారి సుహాసిని ఓ ప్రకటనలో తెలిపారు. సరోగసీ ద్వారా బిడ్డను పొందాలనుకునే దంపతులు అద్దెగర్భాన్నిచ్చే మహిళ విషయంలో జాగ్రత్తలు పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్టు తేలితే సరోగసీ కేంద్రాలతో పాటు దంపతులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సరోగేట్ తల్లిగా గర్భాన్ని ఇవ్వదలచిన మహిళ జీవితంలో రెండుసార్లు మాత్రమే తన గర్భాన్ని అద్దెకు ఇవ్వాలన్నారు. ఈ ప్రక్రియలో మహిళ నుంచి రాతపూర్వకంగా అంగీకారం తీసుకోవడంతో పాటు, ఆమె ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు.



జలపాతాల మాయాజాలం

● కొండపల్లి రిజర్వ్ ఫారెస్టులో జాలువారుతున్న జలపాతాలు
● పర్యాటకులను కట్టిపడేస్తున్న ప్రకృతి సోయగాలు
● జలపాతాల సందర్శనకు పెద్ద ఎత్తున వస్తున్న పర్యాటకులు
● దారి సౌకర్యం లేక నానా ఇబ్బందులు

ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం: వర్షాలతో కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌లో జలపాతాలు ఉప్పొంగుతున్నాయి. పాల నురుగుతో కనువిందు చేస్తున్నాయి. సొగసు చూడతరమా అన్నట్టుగా పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. కొండపల్లి రిజర్వు ఫారెస్టు ప్రకృతి అందాలకు నిలయం. అందులోని కొండపల్లి ఖిల్లా, మూలపాడు నగరవనం మంచి పర్యాటక ప్రదేశాలు. అలాంటి ప్రాంతాల్లో జలపాతాలు పర్యాటకులకు మంచి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎత్తైన కొండలపై నుంచి పచ్చని చెట్లమధ్యలో హొయలొలుకుతూ బిరబిరామంటూ కిందకు జాలువారుతున్న జలపాతాలు అడవి తల్లికే అందాన్ని అద్దుతున్నాయి. కొండపల్లి కోటకు వెళ్లే ఘాట్ రోడ్డు మార్గం మొదట్లోనే పచ్చని కొండల మధ్యలో ఒక జలపాతం కనిపిస్తుంది. ఘాట్ రోడ్డు మీదుగా రెండో మలుపు నుంచి ఇరుకు మార్గంలో కొంత దూరం నడిచి వెళితే మరో జలపాతం వద్దకు చేరుకోవచ్చు. ఘాట్ రోడ్డుపై వెళుతుంటే జలపాతం కిందకు జాలువారుతున్న పెద్ద శబ్దం వినిపిస్తుంటుంది. నాలుగో మలుపు వద్దకు వెళితే మరో జలపాతం కనిపిస్తుంది. ఈ చిన్న జలపాతం నుంచి మరో 2 కిలోమీటర్లు కాలినడకన వెళితే అక్కడ మరో పెద్ద జలపాతం ఉంది. ఇలా కొండపల్లి రిజర్వు ఫారెస్టులో మొత్తం 8 జలపాతాలు ఉన్నాయి. ఖిల్లాపైనే కాకుండా మూలపాడు నగరవనం వద్ద, దొంగమర్ల బావి వద్ద కూడా మరి కొన్ని జలపాతాలున్నాయి. అంతేకాక చిన్నచిన్న జలపాతాలు కోకొల్లలు. వాటిలో కొంగు ధార, జడల కొలను, బేబీ చిత్ర కూట్ వంటికి వీక్షణకు ఆకర్షణీయంగా ఉంటాయి.





దారి సౌకర్యం లేదు

ఫారెస్టులోని జలపాతాలను వద్దకు వెళ్లాలంటే సాహసంతో కూడుకున్న పని. ముఖ్యంగా పిల్లలు, మహిళలు జలపాతాలకు వద్దకు వెళ్లే వీలులేదు. పర్యాటకశాఖ జలపాతాలకు వద్దకు మార్గాలను ఏర్పాటు చేస్తే మంచిదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. జలపాతాలను దూరం నుంచి చూసి ఆనందించడమే తప్ప దగ్గరకు వెళ్లి వాటిలో జలకాలాడే అవకాశం లేకపోడంతో పర్యాటకులు కాస్త నిరుత్సాహపడుతున్నారు. పర్యాటకశాఖ దృష్టి సారించి జలపాతాలను వద్దకు దారి ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

ట్రెక్కింగ్ టీమ్స్ ఎంజాయ్

రిజర్వు ఫారెస్టులో ట్రెక్కింగ్‌కు వచ్చే టీమ్స్ ఈ జలపాతాల వద్ద ఎంతో ఎంజాయ్ చేస్తున్నారు. సుమారు 50 మంది ట్రెక్కింగ్ టీమ్ సభ్యులు భద్రతా చర్యలు పాటిస్తూ ఒక టీమ్ స్పిరిట్‌తో వచ్చి జలపాతాల వద్ద జలకాలాడుతున్నారు.

ప్రస్తుతానికి అనుమతి లేదు

ఇటీవల కొండపల్లి ఖిల్లాపై కొందరు అల్లరి మూకలు చేసిన ఆగడాల వల్ల పోలీసులు కొండపల్లి ఖిల్లాపైకి ఎవ్వర్నీ అనుమతించడం లేదు. ఈ నిషేధం ఎప్పటి వరకు ఉంటుందో తెలియదు. అల్లరి మూకలు ఆడగాలతో ప్రకృతి అందాలు చూసే అవకాశాన్ని పర్యాటకులు కోల్పోయే పరిస్థితి నెలకొంది. పోలీసులు ఈవిషయాన్ని త్వరగా తేల్చి పర్యాటకులకు మళ్లీ ప్రకృతి అందాలను చూసేందుకు అనుమతించాలని వారు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాకే ఆన్‌లైన్‌లోకి..!

● కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక మీకోసంలో ప్రజలిచ్చిన అర్జీల్లోని సమస్యలను పరిష్కరించాకే ఆ సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. మీకోసంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జేసీ గీతాంజలి శర్మ, ట్రైనీ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి 139 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఎలా పరిష్కరించాలో స్పష్టంగా చెప్పామని, జిల్లాస్థాయి అధికారులు కిందిస్థాయి అధికారులకు చెప్పి, సమస్యలు పరిష్కారమైనట్టు ధ్రువీకరించాలని చెప్పామన్నారు. కొందరు అధికారులు ప్రజలిచ్చిన అర్జీలపై సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇలాగే ఉంటే సహించేది లేదన్నారు. అంతేకాక కొందరు అధికారులు కార్యాలయానికి వచ్చి నిద్రపోయి వెళుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీడీసీఎల్ ఎస్ఈ హాజరుకాకపోవడంతో ఆయనకు షోకాజ్ నోటీసును జారీచేయాలని ఆదేశించారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ అధికారులు

వచ్చేవారం నుంచి మండలస్థాయిలో ఎంతమంది అధికారులు హాజరవుతున్నారనే అంశంపై నిఘా ఉంచుతామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో 10 మంది ఉద్యోగులకు మించి పనిచేస్తుంటే మహిళా ఉద్యోగులు వేధింపులకు గురికాకుండా మహిళా వేధింపుల నివారణ చట్టం కింద అంతర్గత కమిటీలు వేయాలన్నారు పరిశ్రమలు, ప్రైవేటు సంస్థల్లోనూ ఈ కమిటీల ఏర్పాటుకు అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఇంకా జిల్లాలో 27 ప్రభుత్వ కార్యాలయాల్లో ఈతరహా కమిటీలు ఏర్పాటు చేయలేదన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణపై ముందస్తు ఏర్పాట్లు

ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణలో ముందస్తు ప్రణాళికకు రూపొందించాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబరులో సోమవారం జేసీ గీతాంజలిశర్మ, ట్రైనీ కలెక్టర్ ఫర్హీన్‌జాహిద్‌తో కలిసి ధాన్యం సేకరణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో సాధారణ రకం ధాన్యం క్వింటాలుకు రూ.2,360, ఏ-గ్రేడ్ ధాన్యానికి రూ.2,389 మద్దతుధరగా నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం విక్రయించి పూర్తిస్థాయి మద్దతుధర పొందేలా రైతులకు పొలంబడి వంటి కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. డేటాఎంట్రీ ఆపరేటర్లు, సాంకేతిక సిబ్బందికి పాటించాల్సిన నియమాలపై ముందస్తు శిక్షణ ఇవ్వాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఈ-పంట నమోదు 30 శాతం పూర్తయిందని, ఈ-పంట నమోదుతో పాటు ఈకేవైసీ కూడా పూర్తి చేయాలన్నారు. మిల్లర్ల వద్ద తేమశాతం కొలిచే పరికరాలు ఉన్నయా లేవా అన్నది అధికారులు పరిశీలించాలన్నారు. ధాన్యం రవాణాలో జీపీఎస్ పరికరాలను సిద్ధం చేయాలన్నారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు శివరాంప్రసాద్, డీఎస్‌వో మోహన్‌బాబు, వ్యవసాయశాఖ జేడీ పద్మావతి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మురళీకిషోర్, మార్కెటింగ్ విభాగం ఏడీ నిత్యానందం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ

బాధితులకు న్యాయం చేస్తాం

● కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం క్రైమ్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాధితులకు కృష్ణాజిల్లా పోలీసులు ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎస్పీ ఆర్ గంగాధరరావు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీ కోసంలో ఆయన స్వయంగా బాధితుల సమస్యలను విని అర్జీలు తీసుకున్నారు. 39 మంది బాధితులు జిల్లా ఎస్పీని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. తోట్లవల్లూరు నుంచి ఒక వివాహిత భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని, పెడన నుంచి ఒక యువకుడు ఉద్యోగం కోసం డబ్బులు కట్టి మోసపోయానని, అవనిగడ్డ నుంచి వృద్ధుడు ఆస్తి కోసం తన కుమారులు ఇంటి నుంచి గెంటేశారని ఎస్పీ దృష్టికి తీసుకు వచ్చారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధిత పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు కేసులను రిఫర్ చేసి సాధ్యమైనంత త్వరగా కేసులు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

మగబిడ్డ దత్తత పేరుతో మోసం

● నలుగురిపై కేసు

విద్యాధరపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మగబిడ్డని దత్తతకు ఇస్తామని మాయ మాటలు చెప్పి తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాకు చెందిన వ్యక్తి వద్ద డబ్బులు తీసుకుని మోసం చేసిన నలుగురిపై సోమవారం భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్గొండ జిల్లా నకరికల్ బొడ్డురాయి బజారులో దాసరి శివ కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. ఇతను డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడి సోదరి తమ్మాడగోని మౌనికకు సంతానం లేదు. తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవీంద్ర వద్దకు వచ్చే కవ్విలి లక్ష్మణ్ రెడ్డి దాసరి శివకు పరిచయమయ్యాడు. తన సోదరికి సంతానం లేదని శివ లక్ష్మణ్‌రెడ్డికి మాటల సందర్భంలో చెప్పాడు. దీంతో లక్ష్మణ్ రెడ్డి తాను విజయవాడ కలెక్టర్ ద్వారా మగబిడ్డను దత్తత ఇప్పించి రిజిస్ట్రేషన్ చేయిస్తానని నమ్మబలికి రూ.4లక్షలిస్తే మగబిడ్డను ఇస్తానని శివకు చెప్పాడు. ముందస్తుగా రూ.2లక్షలు అడ్వాన్స్ ఇవ్వాలని, మిగిలిన డబ్బులు మగబిడ్డను ఇచ్చిన తరువాత ఇవ్వాలని చెప్పాడు. లక్ష్మణ్ రెడ్డి సూచనల మేరకే శివ రూ.2లక్షలు ఇచ్చాడు. డబ్బులిచ్చి 2 నెలలైనా బిడ్డను ఇవ్వకపోవటంతో శివ లక్ష్మణ్ రెడ్డిని పలుసార్లు అడిగాడు. లక్ష్మణ్ రెడ్డి ఆగస్టు 18న మూడు దఫాలుగా రూ.12వేలు శివ వద్ద ఆన్‌లైన్‌లో తీసుకున్నాడు. అదేరోజు మగబిడ్డ గురించి శివ ప్రశ్నించగా లక్ష్మణ్ రెడ్డి రూ.2లక్షలు తీసుకుని విజయవాడ రమ్మని ఫోన్‌లో తెలిపాడు. దీంతో శివ రూ.2లక్షలు తీసుకుని విజయవాడ భవానీపురం పున్నమీఘాట్ వద్దకు ఆ రోజు రాత్రి వెళ్లాడు. అక్కడ లక్ష్మణ్ రెడ్డి మౌలాలి అనే వ్యక్తిని శివకు పరిచయం చేసి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్ షేక్ ఫాతిమాతో మాట్లాడి మగబిడ్డను అప్పజెప్పుతాడన్నాడు. ఆ రోజు రాత్రి 11 గంటలకు మగబిడ్డను అప్పజెప్పుతామని శివను లక్ష్మణ్‌రెడ్డి, మౌలాలి విజయవాడ ప్రభుత్వాసుపత్రి వద్దకు కారులో తీసుకువెళ్లారు. మౌలాలి హాస్పటల్ నుంచి డాక్టర్ ఫాతిమా అనే మహిళను వెంటబెట్టుకు వచ్చి డబ్బులివ్వమని శివను అడిగాడు. శివ లక్ష్మణ్ రెడ్డి సమక్షంలో రూ.2లక్షలను మౌలాలి, ఫాతిమాకు ఇచ్చారు. డబ్బులు తీసుకుని మగబిడ్డను అప్పగించకపోవటంతో శివకు అనుమానం వచ్చి ఫోన్ చేయగా మౌలాలి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. బాధితుడు లక్ష్మణ్‌రెడ్డిని ప్రశ్నించటంతో బబ్బూరి శ్రీనివాస్ అనే వ్యక్తి ఇంటికి తీసుకువెళ్లాడు. బబ్బూరి శ్రీనివాస్ శివను మందలించాడు. ఆ సమయంలో లక్ష్మణ్ రెడ్డి బయటకు వెళ్లిపోయాడు. బాధితుడు శివకు అనుమానం వచ్చి లక్ష్మణ్‌రెడ్డికి ఫోన్ చేయగా, లక్ష్మణ్ రెడ్డి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉంది. బాధితుడు 20న ఓ బార్‌లో ఉన్న లక్ష్మణ్ రెడ్డిని పట్టుకుని బిడ్డకోసం నిలదీశాడు. దీంతో మోసపోయానని తెలుసుకున్న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు లక్ష్మణ్ రెడ్డి, మౌలాలి, ఫాతిమా, బబ్బూరి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

● మరో ఇద్దరికి గాయాలు ● అతివేగమే ప్రమాదానికి కారణం

గుణదల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అతివేగం ఒకరి ప్రాణాలు బలితీసుకోగా మరో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన మాచవరం వద్ద సోమవారం జరిగింది. మోపిదేవి మండలం ఉత్తర తిరువూరు లంక ప్రాంతానికి చెందిన కన్నా రాజ్యలక్ష్మి (37) కేన్సర్‌తో బాధపడుతోంది. మాచవరం వద్దగల కేన్సర్ హాస్పిటల్లో వైద్యం కోసం ప్రసాదంపాడులోని బంధువుల ఇంటికి వచ్చింది. సోమవారం తల్లితో కలిసి కేన్సర్ హాస్పిటల్‌కు చేరుకుని వైద్యం చేయించుకుని తిరిగి వెళ్లేందుకు మాచవరం డౌన్ బస్టాప్ వద్దకు నడుచుకుంటూ వెళుతున్నారు. దాసాంజనేయస్వామి ఆలయం వైపు నుంచి రామవరప్పాడు వైపు అతివేగంగా వస్తున్న కారు ముందుగా ఓ పాదచారుణ్ణి బలంగా ఢీకొట్టగా పాదచారుడు ఎగిరి కారు అద్దంపై పడటంతో కారు అదుపు తప్పి నడుచుకుంటూ వస్తున్న కన్నా రాజ్యలక్ష్మిని ఢీకొట్టింది. దీంతో రాజ్యలక్ష్మికి తీవ్ర రక్తస్రావం జరగడంతో అక్కడికక్కడే చనిపోయింది. కుమార్తె మరణాన్ని చూసిన తల్లి హృదయం అల్లాడిపోయి కుప్పకూలిపడిపోయింది. సమాచారం అందుకున్న మాచవరం సీఐ ప్రకాష్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. కారు అతివేగంగా రావడం వల్లనే ప్రమాదం జరిగిందని స్థానికులు పోలీసులకు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో చనిపోయిన మహిళ రాజ్యలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కారు డ్రైవర్ షేక్ బాజీని అదుపులోకి తీసుకుని కారును స్టేషన్‌కు తరలించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మాచవరం సీఐ ప్రకాష్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేణు

ఎల్ఐసీ 69వ ఆవిర్భావ దినోత్సవం

పటమట, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): విజయవాడ బెంజిసర్కిల్ నగరశాఖ-4లో ఎల్ఐసీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించినట్టు సంస్థ ఆర్ఎం వేణు తెలిపారు. ఈ వేడుకకు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ డీన్ రామినేని శివప్రసాద్, ఐడీబీఐ డీజీఎం సాయి రత్నప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ఎల్ఐసీ విశిష్టతను వివరించారన్నారు. అనంతరం సీనియర్ బీఎం రామకృష్ణ, ఇతర అధికారులు, ఏజెంట్లు, పాలసీదారులు, రిటైర్డ్ ఉద్యోగులు, నాగరాజు, ఎన్ వెంకటేశ్వర్లు, లక్ష్మీపతిరావు, ప్రసాద్ ప్రసంగించారు.



అనన్య ఆనంద్‌కు అభినందనలు తెలుపుతున్న స్కూల్ చైర్మన్ వీరమాచినేని వంశీ, డైరెక్టర్ శాంతి, తదితరులు

జాతీయ పోటీలకు నెక్స్ట్‌జెన్ విద్యార్థి ఎంపిక

భారతీనగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గురునానక్ కాలనీలోని నెక్స్ట్‌జెన్ స్కూల్లో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని అథోట అనన్య ఆనంద్ త్వరలో ఢిల్లీలో జరుగుతున్న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైందని స్కూల్ చైర్మన్ వీరమాచినేని వంశీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మా విద్యార్థిని అనన్య ఆనంద్ గత నెల ఆగస్టు 24న విజయవాడలోని ఫన్‌టైమ్స్ క్లబ్‌లో జరిగిన యూ-15 ఏపీ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ 2025లో పాల్గొని కాంస్య పతకాన్ని గెలుపొందిందన్నారు. అలాగే 31న ఆదివారం గుంటూరులో జరిగిన యూ-17 రాష్ట్ర టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో పాల్గొని కాంస్య పతకాన్ని గెలిపొందిందన్నారు. త్వరలో ఢిల్లీలో జరగబోయే జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఈ సందర్భంగా అనన్య ఆనంద్‌కు స్కూల్ డైరెక్టర్ శాంతి, ప్రిన్సిపల్ ఎండీ సామాన, వైస్ ప్రిన్సిపల్ డీ కీర్తి అభినందనలు తెలిపారు.

వంశీ బెయిల్ ఆంక్షలు సడలింపు

నెలలో రెండు శనివారాల్లో సంతకాలు

విజయవాడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముదునూరి సత్యవర్ధన్ కేసులో బెయిల్‌పై ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి కోర్టు కొన్ని షరతులను సడలించింది. నెలలో రెండు, నాలుగో శనివారం పటమట పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేయాలని స్పష్టం చేసింది. తన బెయిల్ షరతులను సడలించాలని వంశీ కొద్ది రోజుల క్రితం విజయవాడ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదప్రతివాదనలు ముగియడంతో న్యాయాధికారి పీ భాస్కరరావు సోమవారం తీర్పును వెలువరించారు. బెయిల్ ఇచ్చినప్పుడు ప్రతి శనివారం పటమట పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేయాలని షరతు విధించించారు. తాజాగా ఇచ్చిన తీర్పులో రెండు, నాలుగో శనివారం సంతకాలు చేయాలని పేర్కొన్నారు.

జెన్‌కోలో బదిలీల అరాచకాల వెనుక కుట్ర!

ఆంధ్రజ్యోతి, విజయవాడ: జెన్‌కోలో అడ్డగోలు బదిలీల అరాచకాల వెనుక పెద్ద కుట్రే ఉందని తెలుస్తోంది. ప్రభుత్వంపై ఉద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకతను తెచ్చే కుట్రతో పాటు, అడ్డగోలు బదిలీల మాటున భారీ ఎత్తున వసూళ్లకు తెరతీయవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగుల కరపత్రాల ప్రచారంతో రోజుకో కొత్త విషయం వెలుగు చూస్తోంది. జెన్‌కోలో షాడో ఎండీలుగా కొందరు బోర్డు డైరెక్టర్లు వ్యవహరించటం తీవ్ర ఆరోపణలకు దారి తీస్తోంది.

జెన్‌కోలో ప్రస్తుతం ఐదుగురు డైరెక్టర్లకు గాను ముగ్గురే ఉన్నారు. థర్మల్ ఒకరు, ఐడిల్ ఒకరు చూస్తున్నారు. హెచ్‌ఆర్‌కు మరొకరు ఉన్నారు. కోల్, ఫైనాన్స్ డైరెక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఇద్దరు బోర్డు డైరెక్టర్లు వాటిని నిర్వహిస్తున్నారు. దీంతో మొత్తం జెన్‌కో అంతా తమ చేతుల్లోకి తీసుకుని అడ్డగోలుగా బదిలీలకు పాల్పడుతున్నారు. జెన్‌కో ఉద్యోగులు స్థానికంగా నివశిస్తూ పిల్లలను చదవించుకుంటున్నారు. ఈవిషయం తెలిసి వారిని తీవ్ర ఇబ్బందులు పెట్టేలా బదిలీలకు పాల్పడుతుండటం జెన్‌కోను అతలాకుతలం చేస్తోంది. బదిలీలపై ప్రస్తుతం బ్యాన్ ఉన్నా వైసీపీ సానుభూతిపరుల ముద్ర వేయటం ఎడాపెడా బదిలీలు నిర్వహించటం పరిపాటిగా మారింది. బాధ్యులైన బోర్డు డైరెక్టర్లు వైసీపీ ప్రభుత్వంలో అంతా తామై నడిపించారు. కూటమి ప్రభుత్వంలోనూ వారిదే హవా. తమను తాము కాపాడుకోవటం కోసం ఉద్యోగులను వైసీపీ సానుభూతిపరులుగా ముద్రవేస్తూ బదిలీలకు తెగబడుతున్నారు. నచ్చిన ప్రభుత్వం రాకపోవటంతో ప్రభుత్వానికి అప్రతిష్ట తేవాలన్న ఉద్దేశంతో పాటు ఉద్యోగుల నుంచి అందిన కాడికి పిండుకునేందుకు వేసిన స్కెచ్ అని ఉద్యోగులు వాపోతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో కొందరు డైరెక్టర్లు ఎన్‌టీటీపీఎస్‌లో రాజ్యమేలి బదిలీ అయిన వైఎస్‌ఆర్ ట్రేడ్ యూనియన్ నేతను ఎందుకు తెచ్చారన్నది ఆలోచించాల్సిన విషయం. డైరెక్టర్ల అండతో తమపై వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ నేత సాగించిన వేధింపులకు ప్రతీకారంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇతర సంఘాలు వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ నేతను బదిలీ చేయించాయి. కానీ గోడకు కొట్టిన బంతిలా వెనక్కు వచ్చేశాడు. అంతేకాక గతంలో జెన్‌కోలో పనిచేసిన ఓ అధికారి జగన్ వీర విధేయుడు. జగన్ వస్తే తప్ప పెళ్లికూతురి మెడలో తాళికట్టనని భీష్మించుకున్నాడు. అలాంటి అధికారికి ఆయన కోరుకున్న చోట పోస్టింగ్ ఇచ్చారు.

దీన్ని బట్టి బోర్డు డైరెక్టర్లు వైసీపీ సానుభూతిపరులా? ఉద్యోగులు సానుభూతిపరులా అన్నది ఎవరికైనా అర్థమౌతుంది. ఈ అక్రమ బదిలీలపై ప్రభుత్వం విచారణ జరిపించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 570

రైతుబజారులో ఉల్లి కేజీ రూ.15



గుడివాడ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : కర్నూలులోని ఉల్లి రైతులకు నష్టాలు వాట్టిల్లకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులనుంచి ఉల్లిని కొనుగోలు చేసి రైతుబజారు, మొబైల్ వాహనాల ద్వారా విక్రయిస్తున్నట్టు గుడివాడ రైతుబజారు ఎస్టేట్ అధికారి షేక్ అమీర్‌బాబు అన్నారు. సోమవారం మొబైల్ వాహనాల ద్వారా ఉల్లి విక్రయాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ఉల్లిపాయలను కేజీ కేవలం రూ.15లకే విక్రయిస్తున్నారన్నారు. రైతుబజారు సిబ్బంది తులసీ, పాల్గొన్నారు.

వైభవంగా గణేశ్ నిమజ్జనాలు



కాజలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

కూచిపూడి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి వేడుకల్లో భాగంగా కాజ గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. అనంతరం జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. వినాయక చవితి వేడుకల్లో భాగంగా భట్లపెనుమర్రులో గణేష్ నిమజ్జన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

గుడివాడ : స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ఆరో రోజు స్వామి వారు సిద్ధి, బుద్ధి గణపతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థాన కార్యనిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు) ధర్మకర్తల కమిటీ చైర్మన్ సాయన రాజేష్, సభ్యులు లోయ వాసు, ముళ్లపూడి రమణమూర్తి, పోతురాజు, పంచుమర్తి శ్రీనివాసరావు, శారద, శైలజ, విజయలక్ష్మీ, కనకదుర్గ భవాని, పాల్గొన్నారు.

స్థానిక స్కంద అపార్టుమెంట్‌లో కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీగణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా సోమవారం లడ్డూ వేలంపాటలు నిర్వహించారు. 2కేజీల లడ్డూను గణేస్, రేఖ దంపతులు రూ. 4వేలకు, స్వామి వారి చేతిలోని 5కేజీల లడ్డూను కుమారస్వామి రూ.8,200లకు, మరో 5కేజీల లడ్డూను ఎ.వన్ ఫుడ్స్ మధు దంపతులు రూ.7,007లకు, 28కేజీల పెద్ద లడ్డూను బొప్పన గోపి, జ్యోతి దంపతులకుమార్తె నవిష్కసాయి, కుమారుడు కుష్యంత్‌లు రూ.18వేలకు వేలంపాటలో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, అపార్టుమెంట్ వాసులు పాల్గొన్నారు.



నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధరరావు

గుడివాడ : స్థానిక పెద్ద కాలువ వద్ద ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన ప్రదేశాన్ని ఆదివారం రాత్రి జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ధీరజ్ వినీల్, సీఐలు హనీష్, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పామర్రు: తోటకాపుల రామలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకమందిరంలో సోమవారం ప్రత్యేక పూజాదికాలుతోపాటు, మహిళ భక్తులు గీతాపారాయణం నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు బోతనబోట్ల సుబ్బారావు, పవన్‌శాస్త్రిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో ఉత్సవ కమిటీ నిర్వహకులు దాసరి కొండబాబు, అల్లంశెట్టి కోటేశ్వరరావు,పాల్గొన్నారు. కోటిరెడ్డిపేట, నాగులేరు గట్టుబజారు, యాదవపురం, జుజ్జువరం, గ్రామాల్లో గల వినాయక మండపాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు లైన్‌బజారు యాదవుల రామాలయం వద్ద పూజలందుకున్న గణేశ్ విగ్రహానికి సోమవారం అట్టహాసంగా నిమజ్జనోత్సవం చేశారు. గణేశ్ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల వెంట ఊరేగించారు.

పమిడిముక్కల : మంటాడలో జరుగుతున్న వినాకచవితి నవరాత్రి వేడుకలలో ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా పాల్గొని పూజలు చేశారు.

గుడివాడ రూరల్ : గుడివాడ రూరల్ మండలంలో బొమ్ములూరు, చౌటపల్లి, బిళ్లపాడు తదితర గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.



గుడ్లవల్లేరులో కరెన్సీ నోట్లతో అలంకరించిన వినాయకుడు

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులో సంతబజార్‌లోని గణేష్ యూత్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ ఉత్సవాల్లో పూజించిన వినాయకుని విగ్రహాన్ని, ఇంజనీరింగ్ కళాశాల రోడ్డులోని సాయిబాబా మందిరం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని సోమవారం రాత్రి పుల్లేరురలో నిమర్జన చేశారు. గ్రామంలోని మోటార్ బైక్‌ల మెకానిక్ వర్కర్స్ యువత ఏర్పాటు చేసిన బాల వినాయక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాక నవరాత్రుల పందిరిలో సోమవారం వినాయకుని కరెన్సీ నోట్లతో అలంకరించారు.

పెదపారుపూడి : పెదపారుపూడి మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వానపాముల బీసీ కాలనీలో పూజలు ఘనంగా నిర్వహించారు. వినాయకుడి విగ్రహాన్ని డప్పుమేళాలతో ఊరేగించి ఆ ప్రక్కనే ఉన్న కాలువలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో గణేశ్ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న యువత

అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేస్తాం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి పెన్షన్‌దారునికి పింఛన్‌ను అందిస్తున్నారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం పట్టణంలోని 11వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందుతాయన్నారు. మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, పాల్గొన్నారు.

పమిడిముక్కల: అర్హులందరికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు కూటమి ప్రభుత్వం అందజేస్తుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మంటాడలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ ప్రారంభించి లబ్దిదారులకు అందజేశారు. పి.శ్రీరమణ రాజ్‌కుమార్, సర్పంచ్ వీరమ్మ పాల్గొన్నారు.

పామర్రు : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా ఫించన్లను అర్హులైన లబ్ధిదారులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కె.జ్యోతి పేర్కొన్నారు. పామర్రులో సోమవారం వర్షంలో సైతం వేకువ జామునుంచే సంబంధిత గ్రామ సచివాలయ సంక్షేమశాఖ కార్యదర్శులతోపాటు ఉద్యోగులు చేస్తున్న పింఛన్ల ప్రక్రియను ఆమె పర్యవేక్షించారు.



మంటాడలో పింఛన్లు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా



వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు 1వ తేదీనే అందరికీ పంపిణీ చేయనున్నామని టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ అన్నారు. సోమవారం ఉదయం బొమ్ములూరులో పింఛన్లను పంపిణీ చేశారు. కార్యదర్శి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు :గుడ్లవల్లేరు మండలంలో ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్‌ల పంపిణీ సోమవారం 93 శాతం పూర్తయిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహ్మద్ ఇమ్రాన్ తెలిపారు. మండలంలో 7015 మందికి గాను 6478 మందికి పెన్షన్ పంపిణీ చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అధికారులతో పాటు టీడీపీ,జనసేన నాయకులు పాల్గొన్నారు.

కూచిపూడి : పేదవర్గాల ప్రజలకు సీఎం సహాయనిధి భరోసాగా నిలుస్తుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మండల పరిధిలోని కాజ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే సోమవారం అందజేశారు. కొమ్ము రాంబాబుకు రూ.1,37,884లు, కొమ్ము వాణికి రూ.21,740లు, మునగాల హైమావతికి రూ.16,634 చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు లింగమనేని రామలింగేశ్వరరావు, వీరంకి తులసీదాస్, పార్టీ నేతలు తాతా నారాయణరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బృందగాన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గుడివాడ, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి) : ఇటీవల భారత్ వికాస్ పరిషత్ నిర్వహించిన జాతీయ బృందగాన పోటీల్లో హిందీ భాషలో గానం చేసిన విద్యావికాస్ విద్యార్థులు తృతీయ స్థానాలు సాధించారని పాఠశాల డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాల ఆవరణలో బహుతులు గెలుపొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. హెచ్‌ఎం నాగమల్లేశ్వరరావు, హిందీ ఉపాధ్యాయురాలు షమీమున్నీసా, విద్యార్థులు, పాల్గొన్నారు.

విజన్ గల నాయకుడు చంద్రబాబు

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : అభివృద్ధికి, సుపరిపాలనే కూటమి ధ్యేయమని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. తొలిసారి చంద్రబాబు సీఎంగా కొలువుదీరి ముప్పై ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే కుమార్ రాజా కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పుడు రాజధాని అమరావతి నిర్మాణం, రైతన్నల జీవనాడి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి ప్రజలకు అందించడంతోపాటు విజన్ 2047లక్ష్యంతో ముందుకు సాగుతున్నారన్నారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి, మాజీ ఏఎంసీ చైర్మన్ మండ పాక శంకర్‌బాబు, అబ్బాస్, చాట్ల రమేష్, ఎంపీడీవో కాండ్రు జ్యోతి, వార్డుసభ్యుడు మంతెన రామాంజనేయులు, పాల్గొన్నారు.

గుడివాడ : విజన్ ఉన్న నాయకుడు ఉంటే అభివృద్ధి పరుగులు తీస్తుందని, దీనికి సీఎం చంద్రబాబు రోల్‌మోడల్ అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కొనియాడారు. సోమవారం స్థానిక 11వ వార్డులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి, నేటితో 30ఏళ్లు పూర్తి చేసుకున్నారన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి చంద్రబాబు కట్టుబడి ఉన్నారని, ఏడాదిన్నర కూటమి పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు చంద్రబాబు పాలనదక్షతకు నిదర్శనమని ఎమ్మెల్యే వెనిగండ్ల కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, కూటమి నాయకులు మున్వర్, మౌలాలి, కరీముల్లా పాల్గొన్నారు.



పామర్రులో కేక్ కట్‌చేసి అందరికీ పంచుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

ఉద్యోగులు నిజాయితీ, నిస్వార్థంతో పనిచేయాలి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులు నిజాయితీ, నిస్వార్థంతో ప్రజలకు సేవ చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో నలుగురు ఉద్యోగులకు కారుణ్య నియామకపత్రాలు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎమ్మెల్యే వెనిగండ్ల అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు సేవ చేయాలని, నూతనంగా ఉద్యోగంలో చేరిన వారు అధికారుల సూచనలు పాటిస్తూ, సీనియర్ ఉద్యోగుల సలహాలతో శాఖపరమైన పట్టు సాధించాలని ఆకాంక్షించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కరోనా సమయంలో మృతిచెందిన శానిటేషన్ సిబ్బంది కుటుంబసభ్యులకు ఉద్యోగాలు ఇవ్వడంలో తాత్సర్యం చేసిందన్నారు. వైసీపీ మోసానికి నష్టపోయిన వారికి నేడు ఉద్యోగ నియామక పత్రాలను అందించామన్నారు. ఉద్యోగులకు ఎటువంటి సమస్యలున్న సంప్రదంచవచ్చునని, ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే వెనిగండ్ల స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ సత్యసాయి, పాల్గొన్నారు.



ఉద్యోగులకు నియామకపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

నివాసాల మధ్య మద్యం దుకాణం వద్దు

గుడివాడ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : నివాస ప్రాంతాల్లో , దేవాలయాల సమీపంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయొద్దని నాగవరప్పాడు మహిళలు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక ద్వారకా అపార్టుమెంట్ సమీపంలోని సుమారు 100మందికి పైగా మహిళలు ప్లేకార్డులు, బ్యానర్లు పట్టుకుని నాగవరప్పాడు నుంచి స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఇంటి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే వెనిగండ్లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ నివాస ప్రాంతంలో ఎట్టి పరిస్థితుల్లో బార్ పెట్టేందుకు తాము అంగీకరించబోమని స్పష్టం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఎక్సైజ్ అధికారులకు ఫోన్ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల అధికారులను ఆదేశించారు. ఈ ర్యాలీలో స్థానికులు పాలడుగు సురేంద్ర, పసుపులేటి నరేష్, యార్లగడ్డ కేశవరావు, దేవినేని వీరభద్రరావు, సి.హెచ్.మల్లిక్, మూల్పూరి రాజేష్, తాళ్ళూరి రాఘవేంద్రరావు, లుక్కా రాంబాబు, వసంతవాడ దుర్గారావు, బందలపాటి సత్యనారాయణ , రాంబాబు, ఎన్.కనకారావు, యార్ల బాలచందర్ పాల్గొన్నారు.



ఇళ్ల మధ్య మద్యం దుకాణాలు వద్దంటూ ర్యాలీలో పాల్గొన్న మహిళలు

నిమ్మకూరు, పామర్రులో ఉచిత వైద్యశిబిరాలు నేడు

పామర్రు, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): దివంగత టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు, రాజ్యసభ సభ్యుడు నందమూరి హరికృష్ణ జయంతిని పురస్కరించుకుని నిమ్మకూరులో మంగళవారం ఉచిత మెగా వైద్యశిబిరం, రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర సోమవారం తెలిపారు. ఎన్టీఆర్‌ట్రస్టు, కొప్పర్ల లక్ష్మీ చారిటబుల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే వైద్యశిబిరాన్ని హరికృష్ణ తనయురాలు నందమూరి సుహాసిని, సోదరుడు రామకృష్ణలు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాలు ప్రారంభిస్తారన్నారు. ఉచిత వైద్యశిబిరంలో విజయవాడ అనుగ్రాప్ ఆఫ్ హాస్పిటల్స్‌కు చెందిన చిన్నపిల్లల వైద్యనిపుణులతోపాటు గుండెసంబంధిత వ్యాధుల నిపుణులు, గైనకాలజీస్టులుతోపాటు గుంటూరు లయన్స్ కంటి వైద్యనిపుణులు సేవలందించనున్నారు. ఈ ఉచిత వైద్యశిబిరం, రక్తదాన శిబిరాల ఏర్పాట్లను గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తితో కలసి ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా పరిశీలించి తగు సూచనలందించారు. పామర్రులో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని స్థానిక ఒకటో గ్రామ సచివాలయం ఆవరణలో ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు జనసేన ఇన్‌చార్జి నరేష్ తెలిపారు.



నిమ్మకూరులో ఉచిత వైద్యశిబిరం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా

గొర్రెలకు దోమల నుంచి రక్షణ

తోట్లవల్లూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో గొర్రెలు, పశువులకు దోమలకాటు ఎక్కువగా ఉండటంతో అవి రోగాలబారిన పడతాయి. దోమలనుంచి రక్షణ కల్పించేందుకు కాపరులు ఖర్చుకు వెనుకాడకుండా దోమ తెరలతో పందిళ్లు నిర్మించారు. తోట్లవల్లూరు లంకలోను, పలుచోట్ల ఈ విధంగా దోమ తెరల పాకలు దర్శనమిస్తున్నాయి. మనుషులకే కాదు మనకు జీవనాధారమైన మూగజీవాలను కాపడుకోటానికి శ్రద్ధ చూపటాన్ని అభినందనీయమని చెప్పవచ్చు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

గుడివాడ: ఇటీవల టాటా బిల్డింగ్ ఇండియా, హైదరాబాదు ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ వ్యాస రచన పోటీల్లో స్థానిక విద్యాలయ విద్యార్థులు ప్రతిభ చాటారు. సోమవారం స్థానిక పాఠశాల ఆవరణలో బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్ అభినందించారు. ఈ సందర్భంగా టాటా బిల్డింగ్ ఇండియా ఫీల్డ్ ఆఫీసర్ చొప్పర దాస్‌బాబు సమక్షంలో పతకాలు, సర్టిఫికెట్లను విద్యార్థులకు అందజేశారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గుడ్లవల్లేరు : స్థానిక వి.వి.ఐ.పి.ఎస్ ఫార్మాస్యూటికల్ సైన్సస్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజయం సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు తెలిపారు. చోడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మాస్యూటికల్ సైన్సస్ కళాశాల వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా,సాంస్కృతిక పోటీల్లో తమ విద్యార్థినులు ఎం.భావన,ఎస్.జయశ్రీ లు క్యారమ్స్ డబుల్స్‌లో ద్వితీయ స్థానం సాధించారని ఆయన చెప్పారు. సాంస్కృతిక పోటీల్లో జానపద నృత్యం విభాగంలో ఝాన్సీలక్ష్మీ, లక్ష్మీశకణ్య, జాఫ్రిన్, లావణ్య,స్వప్నిక, హనీష, గాయిత్రిల బృందం ద్వితీయ బహుమతి సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. యాజమాన్యం విజేతలైన విద్యార్థులను, క్రీడా విభాగ ఇన్‌చార్జ్ డాక్టర్ బాలకృష్ణను, సాంస్కృతిక విభాగ ఇన్‌చార్జ్ డాక్టర్ వి.రజని, అధ్యాపకురాలు కుందన లను అభినందించారు.

నీతి, నిజాయితీ గల టీడీపీ నాయకుడు గాదిరెడ్డి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుడివాడ నియోజకవర్గంలో నీతి, నిజాయితీ గల టీడీపీ నాయకుడిని కోల్పోయినట్టు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం లింగవరంలో మరణించిన గాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి మృతదేహాన్ని స్వగృహం వద్ద సందర్శించి నివాళులర్పించారు. అనంతరం పార్థివదేహాన్ని గాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయానికి అహర్నిశలు కృషి చేశాడని కొనియాడారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే తెలిపారు. గాదిరెడ్డి మృతి చెందిన వార్త తెలుసుకున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో లింగవరానికి వచ్చి ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి, కుమారులను, కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కూటమి నేతలు పాల్గొన్నారు.



శ్రీనివాసరెడ్డి పార్థివదేహాన్ని మోస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

నాగేశ్వరరావుకు గిడుగు పురస్కారం



గిడుగు మునిమనుమడు నాగేశ్వరరావును సత్కరిస్తున్న తెలుగు భాషావికాస సమితి సభ్యులు

గుడివాడ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : స్థానిక బంటుమిల్లి రోడ్డులోని దేవరకొండ నాగన్న సత్రంలో తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి 163వ జయంతి సందర్భంగా వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత గిడుగు చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న గిడుగు రామ్మూర్తి మునిమనుమడు నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు భాషా పరిరక్షణకు ప్రభుత్వంతో పాటు సాహితీవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, రచయితలు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. అనంతరం గిడుగు రామ్మూర్తి పురస్కారాన్ని నాగేశ్వరరావుకు అందజేశారు. తెలుగు మహిళ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు సుధారాణి, సమితి సమన్వయకర్త ప్రసాద్, పాల్గొన్నారు.

మొవ్వ ఎంపీడీవోగా సుహాసిని

కూచిపూడి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా సుహాసిని సోమవారం బాధ్యతలు చేపట్టారు. మొవ్వ ఎంపీడీవోగా జూన్ 27వ తేదీన బాధ్యతలు స్వీకరించిన ఆమె జూలై 28న బాపట్లలో నెల రోజులపాటు జరిగిన శిక్షణా తరగతుల కార్యక్రమంలో పాల్గొన్నారు. సోమవారం కార్యాలయ ఏవో శ్రీనివాసరావు నుంచి బాధ్యతలు స్వీకరించారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

గుడివాడ రూరల్: బొమ్ములూరు గ్రామ శివారులో సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో ఎస్సై నంబూరి చంటిబాబు, సిబ్బంది కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.30 వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

యజమాని ఇంట్లో చోరీ

గుడివాడ రూరల్: లక్ష్మీనగర్ కాలనీలో ఓ ఇంట్లో ఒంటరిగా నివాసం ఉంటున్న దేవబత్తుల శేషకుమారి (55) అనే మహిళ వద్దకు సుమారు 15 రోజుల క్రితం అద్దెకు ఇల్లు కావాలని ఒక మహిళ ఆమె అమ్మమ్మతో పాటు వచ్చి అద్దెకు దిగింది. తర్వాత ఆమెను షిర్డీ యాత్రకు తీసుకెళ్లింది. వచ్చే దారిలో విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఫిర్యాదిని వదిలిపెట్టి తిరిగి రాలేదు. చాలా సమయం తర్వాత ఫిర్యాది ఇంటికి చేరుకుని చూడగా, ఇంటి తాళం పగలకొట్టి ఇంట్లో బంగారు, వెండి, నగలు, పట్టు చీరలు ఉన్న బీరువా మాయం అయినట్లు గుర్తించారు. చుట్టుపక్కల వాకబు చేయగా, సదరు అద్దెకు వచ్చిన మహిళే బీరువా దొంగిలించి తీసుకుపోయినట్లు తెలిసింది. సదరు మహిళ ఫిర్యాదు మేరకు ఎస్సై చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 570

అనాథ బాలలను అక్కున చేర్చుకోవాలి : కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అనాథ బాలలకు చేయూత నిచ్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. కలెక్టర్ చాంబరులో అనాథ బాలల సంరక్షణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన బాలల సంరక్షణా కేంద్రాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనాథ బాలల సంరక్షణా కేంద్రాల నిర్వహణ కోసం 36 దరఖాస్తులు రాగా, వాటిలో రెండు ప్రభుత్వ కేంద్రాలతోపాటు, స్వచ్ఛంద సంస్థలు నడిపే 21 కేంద్రాలకు అనుమతులు ఇచ్చారు. 15 మంది అనాథ బాలలకు ధ్రువీకరణపత్రాలను అందజేశారు. వీటి ఆధారంగా యూనివర్సిటీ స్థాయి వరకు మూడు శాతం రిజర్వేషన్ కల్పించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జేసీ గీతాంజలిశర్మ, ట్రైనీ కలెక్టర్ పర్హీన్ జాహిద్, ఏఎస్పీ సత్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి పాల్గొన్నారు.

ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పైడిపాముల కృష్ణకుమారి



పైడిపాముల కృష్ణకుమారి

చల్లపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఐడీసీ) డైరెక్టర్‌గా చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి నియమితులయ్యారు.

ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు వెలువరించింది.

గతంలో చల్లపల్లి జడ్పీటీసీ సభ్యురాలిగా పనిచేసిన కృష్ణకుమారి ప్రస్తుతం చల్లపల్లి సర్పంచ్‌గా ఉన్నారు. జిల్లా తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శిగా పార్టీ కార్యక్రమాల్లో కృష్ణకుమారి చురుకైన పాత్ర పోషిస్తున్నారు.



అవనిగడ్డలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, కనపర్తి శ్రీనివాసరావు



నందమూరులో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



బందరులో 45వ డివిజన్‌లో పింఛన్లు అందజేస్తున్న గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, పి.వి. ఫణికుమార్

పండుగలా పెన్షన్ల పంపిణీ

పేదలకు , దివ్యాంగులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సోమవారం పండుగలా జరిగింది. అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి, నందమూరులో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, బందరులో సీనియర్‌నేత గొర్రెపాటి గోపీచంద్, కానూరులో తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, జరుగువానిపాలెం, మోపిదేవిలలో మండల టీడీపీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, నడకుదిటి జనార్దనరావు, ఎంపీపీ రావి దుర్గావాణి, ఆయా సచివాలయాల కార్యదర్శులు పంపిణీ చేశారు.



మోపిదేవిలో పింఛన్ అందిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు జనార్దనరావు తదితరులు



కానూరులో పింఛను అందజేస్తున్న గోపు సత్యనారాయణ

పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా విస్తృత సేవా కార్యక్రమాలు : బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ రథసారథి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జనసేన పార్టీ ఇన్‌చార్జి, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ తెలిపారు. పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని సోమవారం పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. మంగళవారం ఉదయం జనసేన పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్‌తో కార్యక్రమాలు ప్రారంభిస్తామన్నారు. విద్యుదాఘాతంతో కాలు, చేయి కోల్పోయిన గరాలదిబ్బ గ్రామానికి చెందిన ఏసురాజుకు మైత్రి ఫౌండేషన్, ఎన్నారై చలమలశెట్టి బాలాజీ, దాతల సహకారంతో రూ. 90 వేలతో ఏర్పాటు చేసిన కృత్రిమ కాలును అందజేస్తామన్నారు. పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం, పారిశుధ్య కార్మికులకు దుస్తు లు పంపిణీ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ, అన్నదానాలు, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ, పేదలకు ఆర్థిక సహాయం చేస్తామన్నారు. జనసేన పార్టీ నాయకులు గడ్డం రాజు, నాయకులు, వీర మహిళలు, డివిజన్ ఇన్‌చార్జిలు, పట్టణ మండల జనసేన పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.



గ్రామంలో ఏర్పాటు చేసిన బెంచీలు

ఆదర్శంగా నిలిచిన టి.కొత్తపాలెం జనసైనికులు

నాగాయలంక, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని టి.కొత్తపాలెం జనసైనికులు 'గ్రామసేన' పేరుతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. రూ.25 వేలతో గ్రామంలోని ఫిల్టర్ బెడ్లను బాగు చేయించారు. రూ.8 వేలతో ఒక చేతి పంపును ఏర్పాటు చేశారు. డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగమల్లికార్జునరావు వితరణ చేసిన రూ.10 వేలతో నీటి మోటారు, పైపులను, బెంచీలను సోమవారం సర్పంచ్ బండ్రెడ్డి శివ పార్వతీ, కార్యదర్శి ఆది అశోక్‌కు జనసైనికులు అందజేశారు. గ్రామాభివృద్ధి పనులు చేసిన జనసైనికులను, పాలకవర్గాన్ని గ్రామస్థులు అభినందించారు.

డాక్టర్ శర్మిష్టకు కలెక్టరేట్‌లో ఘన సన్మానం



డాక్టర్ శర్మిష్ఠను సత్కరిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పదవీ విరమణ చేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట సేవలను అభినందిస్తూ సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో కలెక్టర్ బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా అధికారులు ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన అంబటి వెంకట్రావు సోమవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని మర్యాదపూర్వకంగా కలిశారు.

జిల్లాకు వంగవీటి రంగా పేరు పెట్టాలి : బుల్లెట్

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాకు దివంగత వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలని రాధారంగా మిత్ర మండలి ఆంధ్ర, తెలంగాణా అధ్యక్షుడు, జనసేన నాయకుడు బుల్లెట్ ధర్మారావు డిమాండ్ చేశారు. సువర్ణ కల్యాణ మండపంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగా అభిమానులు కులమతాలకు అతీతంగా కలిసి కృష్ణాజిల్లాకు రంగా పేరు పెట్టాలని కోరారు. న్యాయవాది లంకిశెట్టి బాలాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బుల్లెట్ ధర్మారావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వాన్ని గెలిపించుకునేందుకు రంగా అభిమానులు విశేషంగా కృషి చేశారన్నారు. జిల్లాకు వంగవీటి పేరు పెడితే రంగా అభిమానులందరూ సంతోషిస్తారన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి కొల్లు రవీంద్ర ఈ విషయమై చొరవచూపాలన్నారు. మాదివాడ రాము, పంతం గజేంద్ర, కరెడ్ల సుశీల, శ్రీరామచంద్రమూర్తి, బడుగు ఉమాదేవి, వన్నెంరెడ్డి శ్రీనివాసరావు, బత్తుల రమేష్‌బాబు, సయ్యద్ సిరాజుద్దీన్, పి.వి.ఫణికుమార్, ఆళ్లపాటి రమేష్, నిడదవోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేసిన వీఆర్వోలు గోపాలకృష్ణ, రాజేంద్రలను సన్మానిస్తున్న తహసీల్దార్ వనజాక్షి, డీటీ, రెవెన్యూ అధికారులు

ఉద్యోగ విరమణ వీఆర్వోలకు ఘనసన్మానం

చల్లపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి మండలంలో వీఆర్వోలుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వీఆర్వోలు మత్తి గోపాలకృష్ణ, గొల్లపూడి రాజేంద్రకుమార్‌లను తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ డి.వనజాక్షి, డీటీ శ్రీలత వీఆర్వోలను దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. చల్లపల్లి వీఆర్వోలుగా గోపాలకృష్ణ, రాజేంద్ర చేసిన సేవలను గుర్తు చేస్తూ వారిని అభినందించారు. రీసర్వే డిటి నీలిమ, ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, సీనియర్ అసిస్టెంట్ నరసింహారావు, జూనియర్ అసిస్టెంట్ యోచిత, ఉద య్, వీఆర్వో సంఘ నేతలు పరిశ కిరణ్‌కుమార్, ప్రశాంత్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నిమజ్జనోత్సవం

● లడ్డూ ప్రసాదం రూ.35,116



రావివారిపాలెంలో నిమజ్జనోత్సవ ఊరేగింపు



లడ్డూను దక్కించుకున్న సుకవాసి యుగంధర్



అశ్వారావుపాలెంలో వినాయకునికి పూజలు

నాగాయలంక : ప్రసన్న గణపతి ఆలయంలో వినాయక చవితి 68వ వార్షిక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం అర్చకులు సాయి కిరణ్ శర్మ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్‌కి చెందిన యర్రా శ్రీనివాసులు హరికథ భక్తులను అలరించింది. స్వామివారి లడ్డూ వేలం వేయగా నాగాయలంకకు చెందిన సుకవాసి యుగంధర్ రూ.35,116లకు దక్కించుకున్నాడు. బండ్రెడ్డి సుబ్బారావు, గోలి సత్యనారాయణ, తలశిల తాతయ్య, లంకే శ్రీనివాస్ ప్రసాద్, నాగిడి తాతారావు తదితరులతోపాటు శ్రీ ప్రసన్న గణపతి భక్తబృందం పర్యవేక్షించారు. కోడూరు : కోడూరు ఆర్యవైశ్య ప్రార్థనా మందిరం నందు ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జన ఊరేగింపు వైభవంగా జరిగింది. ఆర్యవైశ్య ప్రముఖులు బూరగడ్డ హరినాథ్‌బాబు, జూహూడి సుభాష్ చంద్రబోస్, మద్దాలి ప్రసాద్, అన్నం శ్రీనివాసరావు, అన్నం శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. **పెడన రూరల్** : నందమూరులో పాలకేంద్రం పక్కన ఏర్పాటు చేసిన గణపతి పందిరిలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, జడ్పీటీసీ సభ్యుడు అర్జాన గేష్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాద్‌లను కమిటీ సభ్యులు సన్మానించారు. అనంతరం భారీ అన్న సమారాధన చేశారు. **అవనిగడ్డ రూరల్** : అశ్వారావుపాలెంలో వినాయక చవితి నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. వినాయకుని విగ్రహానికి పూజలు నిర్వహించి, అన్నసమారాధన చేశారు. **మోపిదేవి** : గౌడపాలెం, రావివారిపాలెం, కె.కొత్తపాలెం, పెదప్రోలు గ్రామాల్లో డప్పువాయిద్యాల నడుమ వినాయకుల ఊరేగింపు నిర్వహించారు. మోపిదేవివార్పు వద్ద నిమజ్జనం గావించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించగా, ఎస్సై సత్యనారాయణ అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భద్రతా చర్యలు చేపట్టారు.



జగన్ పత్రిక అసత్యాలు ప్రచురించడంపై కూటమి నిరసన

అవనిగడ్డ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ, సామాజిక పింఛన్లపై జగన్ పత్రిక అసత్యాలు ప్రచురించడాన్ని ఖండిస్తూ అవనిగడ్డలో కూటమి నేతలు సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు నేతృత్వంలో మండలి వెంకట్రామ్, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు అవనిగడ్డలో ప్రదర్శన నిర్వహించి పత్రిక ప్రతులను తగులబెట్టారు. ఇప్పటికైనా సాక్షి యాజమాన్యం, వైసీపీ నేతలు బుద్ధి మార్చుకోవాలని హితవు పలికారు. బండే శ్రీనివాసరావు, మెండు లక్ష్మణరావు, కర్రా సుధాకర్, నడకుదుటి జనార్దనరావు, రావి నాగేశ్వరరావు, పరుచూరి దుర్గా ప్రసాద్, ఘంటసాల రాజమోహనరావు, రావి రత్నగిరి తదితరులు పాల్గొన్నారు.



విశ్రాంత ఎంఈవో నాగేశ్వరరావుకు ప్రముఖుల నివాళి

ఘంటసాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఎంఈవో మొవ్వ నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సోమవారం తాడేపల్లిలో నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పించారు. నాగేశ్వరరావు మృతి పట్ల కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, సీనియర్ నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్, డీసీ చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, కొడాలి పీఏసీఎస్ చైర్మన్ గుత్తికొండ వరప్రసాద్, టీడీపీ నాయకులు కంఠంనేని గోపి, పరుచూరి శ్రీనివాసరావు, గొర్రెపాటి సురేష్, మొవ్వ కోటేశ్వరరావు, సూరపనేని శివరామప్రసాద్, గ్రామ టీడీపీ అధ్యక్షులు యార్లగడ్డ వీరభద్రరావు, ఉపసర్పంచ్ కొడాలి లక్ష్మణరావు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఉద్యోగికి జైలు, జరిమానా

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చెల్లని చెక్కు కేసులో మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ ఉద్యోగికి ఆరునెలలు జైలుశిక్ష, నాలుగు లక్షల జరిమానా విధిస్తూ మచిలీపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిసుధ సోమవారం తీర్పు చెప్పారు. ఫిర్యాది తాడిశెట్టి వెంకట కృష్ణారావు, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ కథనం ప్రకారం మచిలీపట్నం నగర కార్పొరేషన్‌లో పనిచేసే కళా కేశవ 2020 జనవరి 5వ తేదీన తన కుటుంబ అవసరాల నిమిత్తం ఫిర్యాది కృష్ణారావు వద్ద ఐదు లక్షల రూపాయలు అప్పు చేశాడు. ప్రామిసరీ నోటు కూడా రాయించి ఇచ్చాడు. అప్పు తీర్మానం నిమిత్తం 2021 జూన్ 21 వ తేదీన నాలుగు లక్షల రూపాయలు ఆంధ్రా బ్యాంక్ చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో దాఖలు చేయగా తిరిగి వచ్చింది. నోటీసు పంపినా కేశవ స్పందించక పోవడంతో 2021 లో తాడిశెట్టి వెంకటకృష్ణారావు పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఇరువర్గాల వాద ప్రతివాదనలు విన్న న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో ఆరు నెలలు జైలుశిక్ష, రూ.4లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.



ఎస్.టి.పి.కుమార్ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి

ఎస్.టి.పి.కుమార్ సేవలు అభినందనీయం

అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రిన్సిపాల్ ఎస్.టి.పి.కుమార్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. పులిగడ్డలోని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పదవీ విరమణ సభ సోమవారం పాఠశాలలో జరిగింది. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పాల్గొని ఎస్.టి.పి. కుమార్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎంఈవోలు, పలు గురుకులాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్ఐసీతో ప్రజలకు రక్షణ



ముఖ్యఅతిథి సీనియర్ సివిల్ జడ్జి కె.వి.రామకృష్ణను సత్కరిస్తున్న ఎల్ఐసీ ఎస్‌డీఎం సుధాకర్‌బాబు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పేద, మధ్య తరగతి ప్రజలకు జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ప్రయోజనం చేకూర్చాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి.రామకృష్ణయ్య అన్నారు. ఎల్ఐసీ డివిజన్ కార్యాలయం వద్ద జీవిత బీమా వారోత్సవాలను సివిల్ జడ్జి కెవి రామకృష్ణయ్య ప్రారంభించి ప్రసంగించారు. పాలసీదారుల సమస్యలకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచితంగా న్యాయ సహాయం అందిస్తుందన్నారు. జీవిత బీమా సీనియర్ డివిజనల్ మేనేజరు డాక్టర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ, ప్రతి కుటుంబానికి జీవిత బీమా రక్షణ కల్పిస్తుందన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. మార్కెటింగ్ మేనేజర్లు, పాలసీదారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా లీలా ప్రశాంత్



చల్లపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి మండల వీఆర్వోల సంఘం కార్యవర్గ ఎన్నిక సోమవారం వీఆర్వో కార్యాలయంలో జరిగింది. అధ్యక్షునిగా మల్లవోలు లీలాప్రశాంత్, కార్యదర్శిగా దిరిశం రవిబాబు, కోశాధికారిగా నల్లూరి ప్రతిమ, ఉపాధ్యక్షునిగా ముదునూరి అమలేశ్వరరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా మత్తి గోపాలకృష్ణ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు పరిశ కిరణ్‌కుమార్, చల్లపల్లి ప్రసాద్, కళ్లేపల్లి బేబి, తూము శ్రీనివాసరావు, బీసాబత్తిన నీలికాంత్, పెనుమూడి వెంకటేశ్వరరావు, కుంభా నాంచారయ్య పాల్గొన్నారు. నూతన అధ్యక్షునిగా ఎన్నికైన ప్రశాంత్‌ను, కార్యవర్గాన్ని వీఆర్వోలు దుశ్శాలువాతో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఈఈ, జేడీ, ఎఫ్‌డీవో

రైతుల ఫిర్యాదుకు కలెక్టర్ స్పందన

● క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన

బంటుమిల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కొర్లపాడు గ్రామ పంచాయతీ పెద పాండ్రాక రెవెన్యూ పరిధిలో చేపల చెరువు యజమాని వల్ల నష్టపోతున్నామంటూ రైతులు కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాలతో డ్రైనేజీ డీఈ కిరణ్‌బాబు, ఫిషరీస్ జేడీ నాగరాజు, ఎఫ్‌డీవో వీరవెంకటసాయి క్షేత్ర స్థాయిలో సోమవారం సందర్శించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. రైతుకు, అతనికి సహకరించిన వీఆర్ఏపై తగు చర్యలు తీసుకోవాలని రైతులు కేదార్, ఎం.సుబ్రహ్మణ్యం, వీరాంజనేయులు, ఏడుకొండలు, సిహెచ్ సుబ్రమణ్యం, నాగరాజు, ప్రేమ్‌కుమార్, నరసమ్మ, అయ్యప్ప తదితరులు కోరారు.

ఎంవీకేకు ఘననివాళి

అవనిగడ్డ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డలో మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, మండలి వెంకట్రామ్ తదితరులు వెంకట కృష్ణారావు విగ్రహానికి నివాళులర్పించారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, మత్తి శ్రీనివాసరావు, రాయపూడి వేణుగోపాలరావు, రాజనాల వీరబాబు, బచ్చు రఘునాథ్ ప్రసాద్, బొప్పన భాను, యాసం చిట్టిబాబు, కర్రా సుధాకర్, బండే రాఘవ, పరుచూరి దుర్గాప్రసాద్, యలవర్తి నాగమునేశ్వరరావు, మొగల్ మురాద్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

మన కోసం మనం ట్రస్ట్‌కు రూ.60 వేల విరాళం

చల్లపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ సుందర చల్లపల్లి సాధనకోసం అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపడుతున్న మన కోసం మనం ట్రస్ట్‌కు దాత లు రూ.60వేల విరాళం అం దజేశారు.

భట్లపెనుమర్రు ప్రముఖులు చలసాని కాంచనరావు జ్ఞాపకార్థం కుమార్తె శ్రీలక్ష్మి, అల్లుడు కంఠంనేని నరహరి (ఎన్నారై), వారి కుమార్తెలు డాక్టర్ హారిక, నమ్రత స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డిఆర్‌కె.ప్రసాద్‌ను సోమవారం విరాళం చెక్కును అందించారు. స్వచ్ఛ కార్యకర్తల తరఫున డీఆర్‌కే కృతజ్ఞతలు తెలిపారు.